Follow: @ANNTELUGU
17-05-2026
ANN తెలుగు
# మహా పత్రిక
ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 140 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## సంక్షోభం తలెత్తినా దేశానికి ఇక నో టెన్షన్...

నయా పైసా ఖర్చు లేకుండా
మన గడ్డపై 30 మిలియన్ బారెళ్ల చమురు!

భారత పన్ను చెల్లింపుదారులపై సున్నా భారం..
అత్యవసరమైతే ఆ చమురు మనదే

ప్రధాని మోదీ పర్యటనతో
కుదిరిన చారిత్రక 'ఎనర్జీ డిప్లమసీ' ఒప్పందం

అరబ్ దేశాల ఆయిల్.. మన గడ్డపై సేఫ్...

**దుబాయ్, మహా:** మధ్యప్రాచ్యంలో (మిడిల్ ఈస్ట్) యుద్ధ మేఘాలు కమ్ముకున్నా, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకినా సరే.. ఇకపై భారతదేశానికి ఎలాంటి టెన్షన్ లేదు. అగ్రరాజ్యాలు సైతం ఇంధన భద్రత కోసం అల్లాడుతున్న ప్రస్తుత తరుణంలో, భారత ప్రభుత్వం అత్యంత వ్యూహాత్మకమైన మాస్టర్ స్ట్రోక్ వేసింది. నయా పైసా ఖర్చు లేకుండా, విదేశీ చమురును మన గడ్డపై భద్రపరుచుకునే చారిత్రాత్మక ఒప్పందానికి తెరతీసింది.

మిగతా 2లో

**టాప్ న్యూస్**



### మూడో బిడ్డ పుడితే రూ.30 వేలు

- నాలుగో బిడ్డకు రూ.40 వేల నజరానా
- చంద్రబాబు సంచలన ప్రకటన
- తగ్గుతున్న జనాభా రేటుపై ఆందోళన..

02



### అండమాన్‌ను తాకిన నైరుతి రుతుపవనాలు

- ఈనెల 26నే కేరళ తీరానికి వర్షా లు
- అండమాన్, నికోబార్ దీవుల్లో దంచికొడుతున్న వానలు
- ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు అతిపెద్ద ఉపశమనం
- ఖరీఫ్ వ్యవసాయానికి అత్యంత సానుకూల వాతావరణం

02



### కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి తప్పించాలి

- ప్రధానిని కోరిన కల్వకుంట్ల కవిత

02

# బండి భగీరథ్ అరెస్ట్

## న్యాయపరమైన దారులన్నీ మూసుకుపోవడంతో పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో సరెండర్

హైకోర్టులో దక్కని ఊరట.. 'పోక్సో' ఉచ్చులో కేంద్ర మంత్రి తనయుడు

దొరికిపోవడం కంటే లొంగిపోవడమే మేలని నిర్ణయం

తామే పట్టుకున్నామని పోలీసుల ప్రకటన.. పోలీసుల 'సాఫ్ట్ అప్రోచ్' తీరుపై తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, మహా:** రాష్ట్ర రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా తీవ్ర ఉత్కంఠ రేపుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ ను పోలీసులు అరెస్టు చేసినట్లు ప్రకటించారు . మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలతో పోక్సో కేసు ఎదుర్కొంటున్న భగీరథ్, ఎట్టకేలకు పోలీసుల ఎదుట లొంగిపోయాడని కుటుంబ సభ్యులు తెలపగా, అరెస్ట్ చేశామని పోలీసులు ప్రకటించారు . శనివారం ఆయన నేరుగా కేసు నమోదైన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని సరెండర్ కావడంతో, అజ్ఞాతంలో ఉన్న ఆయన చుట్టూ అల్లుకున్న హైడ్రామాకు తెరపడింది. అరెస్టు నుంచి తప్పించుకునేందుకు అన్ని మార్గాలు వెతికినప్పటికీ, చట్టపరంగా లీగల్ రక్షణ దొరికే దారులన్నీ మూసుకుపోవడంతో ఆయనకు జైలు జీవితం తప్పనిసరి అయింది.





### హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ..

భగీరథ్ లొంగుబాటుకు ప్రధాన కారణం న్యాయస్థానంలో ఎదురైన చుక్కెదురేనని స్పష్టమవుతోంది. ముందస్తు బెయిల్ లేదా అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం అర్ధరాత్రి వరకు హైకోర్టు వెకేషన్ బెంచ్ సుదీర్ఘంగా విచారణ జరిపింది. దర్యాప్తు ప్రాథమిక దశలో ఉందని, ఈ సమయంలో కేసులో జోక్యం చేసుకోలేమని కోర్టు తేల్చిచెప్పింది. ఎలాంటి అరెస్ట్ స్టే ఇచ్చేందుకు న్యాయమూర్తి నిరాకరించారు. దీనికి తోడు, బాధితురాలి వయస్సుకు సంబంధించిన అధికారిక రికార్డులను పరిశీలించగా, ఆమె మైనర్ అని పక్కాగా నిర్ధారణ కావడంతో భగీరథ్ మెడకు పోక్సో ఉచ్చు మరింత గట్టిగా బిగుసుకుంది. తీవ్రమైన, నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు కావడంతో పోలీసులకు దొరికిపోయి అరెస్టయ్యే కన్నా, గౌరవప్రదంగా వెళ్లి లొంగిపోవడమే ఉత్తమమని భావించిన నిందితుడు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

### పోలీసుల తీరుపై అనుమానాలు

కేంద్ర మంత్రి కుమారుడు కావడంతో ఈ కేసులో సైబరాబాద్ పోలీసుల వ్యవహారశైలి తీవ్ర విమర్శలకు తావిస్తోంది. భగీరథ్ అజ్ఞాతంలోకి వెళ్లగానే ఆయన కోసం ఏకంగా ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, దేశం దాటి పోకుండా లుక్‌అవుట్ సర్క్యులర్ సైతం జారీ చేశామని పోలీసులు హడావిడి చేశారు. ఆ ప్రకటన చేసిన కొద్ది గంటల్లోనే ఆయన నేరుగా స్టేషన్‌కు నడిచుకుంటూ వచ్చి సరెండర్ కావడం వెనుక పోలీసుల 'సాఫ్ట్ అప్రోచ్' స్పష్టంగా కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నేరస్తుల లొకేషన్ ట్రేసింగ్, కాల్ డేటా రికార్డ్స్ విశ్లేషణలో రాష్ట్ర పోలీసులు అత్యంత అడ్వాన్స్‌డ్‌గా ఉన్నప్పటికీ.. భగీరథ్‌ను నేరుగా పట్టుకోకుండా కేవలం పైపైనే వెతికినట్లు నటించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన స్వయంగా వచ్చి లొంగిపోయేందుకే పోలీసులు తెరవెనుక సమయం ఇచ్చారన్న వాదనలు బలంగా బలంగా వినిపిస్తున్నాయి.

#### బేఖాతరైన హనీట్రాప్ వాదన.. ఇక రిమాండ్‌కే..

పోక్సో కేసు నమోదు కాగానే, తమ కుమారుడిని ఇరికించారని, రూ. 5 కోట్లు డిమాండ్ చేస్తూ ఎదురు పార్టీ 'హనీట్రాప్' చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతోందని నిందితుల వర్గం తీవ్రంగా వాదించింది. అయితే, చట్టం ముందు ఈ వాదనలు ఏమాత్రం నిలబడలేదు. బాధితురాలు మైనర్ అని తేలడంతో, పోక్సో చట్టం ప్రకారం పరస్పర అంగీకారం అనే వాదనకు కోర్టుల్లో ఏమాత్రం తావుండదు. చట్టం తన పని తాను చేసుకుపోతుండటంతో, నిందితుడి వర్గం చేసిన ఎదురుదాడి ప్రయత్నాలు బెడిసికొట్టాయి. లొంగిపోయిన బండి భగీరథ్‌ను అదుపులోకి తీసుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు, నిబంధనల ప్రకారం ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించి, కోర్టు ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

### చట్టం ముందు అందరూ సమానులే!

- కుమారుడి లొంగుబాటుపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక ప్రకటన
- తప్పు చేయలేదని నా బిడ్డ పదేపదే చెబుతున్నాడు.. న్యాయవ్యవస్థపై నాకు సంపూర్ణ నమ్మకం ఉంది
- ఆధారాలు చూసి బెయిల్ వస్తుందని లాయర్లు చెప్పడం వల్లే విచారణకు పంపడంలో కొంత జాప్యం

02

## ఓటర్ల జాబితా సమగ్ర ప్రక్షాళనకు మోగిన నగారా

### అక్టోబర్ 1న తుది జాబితా విడుదల

రంగంలోకి 35 వేల మంది అధికారులు!

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి




**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రక్షాళన, ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు భారత ఎన్నికల సంఘం అధికారికంగా శ్రీకారం చుట్టింది. హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక మీడియా సమావేశంలో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఈ బృహత్తర కార్యక్రమానికి సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను లాంఛనంగా విడుదల చేశారు. ఈ అత్యంత ప్రతిష్టాత్మక సమావేశంలో అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డితో పాటు ప్రభుత్వ అదనపు కార్యదర్శి శంకర్, సహాయ కార్యదర్శి ఏ.ఎస్. చారి, ఐటీ ప్రాజెక్ట్ మేనేజర్ చిరంజీవి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పకడ్బందీగా, ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా జాబితాను రూపొందించేందుకు యంత్రాంగం భారీ కసరత్తు చేపట్టిందని ఈ సందర్భంగా వారు స్పష్టం చేశారు. ఓటర్ల సవరణ ప్రక్రియ జూన్ మాసంలో ప్రారంభమై అక్టోబర్ వరకు నిర్విరామంగా కొనసాగనుంది. ఎన్నికల సంఘం జారీ చేసిన అధికారిక షెడ్యూల్ ప్రకారం జూన్ 25వ తేదీ నుంచి జూలై 24 వరకు ఇంటింటి గుర్తింపు (హౌస్ టు హౌస్ ఎన్యుమరేషన్) కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అనంతరం జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారికంగా ప్రచురిస్తారు. ఈ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు, క్లెయిమ్‌లు ఉంటే వాటి దాఖలుకు జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు గడువు విధించారు.

మిగతా 2లో

## వెండి దిగుమతులపై నిషేధం

### 15 శాతానికి చేరిన బంగారం సుంకం!

ఆర్థిక వ్యవస్థ రక్షణకై కేంద్ర ప్రభుత్వ మాస్టర్ స్ట్రోక్

అన్ని రూపాల్లో వెండి దిగుమతులపై తక్షణ బ్యాన్

పశ్చిమాసియా సంక్షోభం, విదేశీ మారక నిల్వల పతనం నేపథ్యంలో కఠిన చర్యలు

కొద్ది రోజుల క్రితమే 6 నుంచి 15 శాతానికి పెరిగిన బంగారం దిగుమతి సుంకం



**హైదరాబాద్, మహా:** అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిణామాల నేపథ్యంలో దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకునే దిశగా కేంద్ర ప్రభుత్వం అత్యంత సంచలన నిర్ణయం తీసుకుంది. విదేశీ మారక నిల్వలను పొదుపు చేసేందుకు ఉక్కుపాదం మోపింది. దేశంలోకి వెండి దిగుమతులను తక్షణమే నిలిపివేస్తూ సంచలన ప్రకటన చేసింది. అన్ని రూపాల్లో (ముడి వెండి, ఆభరణాలు, ఇతర వస్తువులు) వెండి దిగుమతులపై పూర్తిస్థాయిలో నిషేధం (బ్యాన్) విధిస్తూ కఠిన ఆంక్షల అస్త్రాన్ని ప్రయోగించింది. విదేశీ మారక నిల్వలు కరిగిపోకుండా అడ్డుకట్ట వేయడానికి, దేశ వాణిజ్య లోటును కట్టడి చేయడానికి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ ఈ ఆకస్మిక చర్యలకు ఉపక్రమించింది. ఇప్పటికే బంగారం దిగుమతి సుంకాన్ని కేంద్రం భారీగా పెంచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఏకంగా వెండి దిగుమతులపై ఆంక్షల వలయం బిగించడం దేశీయ బులియన్ మార్కెట్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

**విదేశీ మారక నిల్వల రక్షణే లక్ష్యంగా భారీ స్కెచ్**

గత కొంతకాలంగా పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం, ముడి చమురు ధరల పెరుగుదల వల్ల రూపాయితో పాటు భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. ప్రధానంగా బంగారం, వెండి దిగుమతుల కోసం దేశం నుంచి భారీ ఎత్తున విదేశీ మారక ద్రవ్యం (డాలర్లు) బయటకు

మిగతా 2లో

## సీబీఎస్ఈ సంచలన నిర్ణయం

- 9, 10 తరగతుల్లో త్రిభాషా విధానం తప్పనిసరి
- 2026 జూలై నుంచి దేశవ్యాప్తంగా నూతన విధానం అమలు
- కనీసం రెండు భారతీయ భాషలు చదవడం ఆవశ్యకం
- అన్ని అనుబంధ పాఠశాలలకు మార్గదర్శకాలు జారీ



**హైదరాబాద్, మహా:** జాతీయ విద్యా విధానం స్ఫూర్తితో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) విద్యా వ్యవస్థలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలను, బహుళ భాషా పరిజ్ఞానాన్ని పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా సీబీఎస్ఈ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై 9, 10 తరగతుల విద్యార్థులకు త్రిభాషా విధానాన్ని (త్రీ లాంగ్వేజ్ ఫార్ములా) తప్పనిసరి చేస్తూ అధికారిక ప్రకటన వెలువరించింది. ఈ నూతన విధానం 2026 జూలై విద్యా సంవత్సరం నుంచి దేశవ్యాప్తంగా ఉన్న సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలలన్నింటిలో కచ్చితంగా అమలు కానుందని

మిగతా 2లో

## హైదరాబాద్‌లో కలకలం రేపిన జంట హత్యలు

అప్పు తీసుకున్న వారే యమభటులై.. తాండూరులో వృద్ధ మహిళల కిడ్నాప్

మొయినాబాద్ ఫామ్‌హౌస్ సమీపంలో మృతదేహాల పాతివేత



**హైదరాబాద్, మహా:** ఆపదలో ఉన్నప్పుడు అప్పుగా డబ్బులిచ్చి ఆదుకున్న పాపానికి ఇద్దరు వృద్ధ మహిళలు అత్యంత దారుణంగా హత్యకు గురయ్యారు. తీసుకున్న అప్పు తిరిగి చెల్లించడం ఇష్టం లేని దుర్మార్గులు, పక్కా పథకం ప్రకారం ఆ మహిళలను కిడ్నాప్ చేసి కిరాతకంగా హతమార్చారు. అటుపై ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాలను నిర్మానుష్య ప్రాంతంలో పూడ్చిపెట్టారు. హైదరాబాద్ శివార్లలోని మొయినాబాద్ సమీపంలో వెలుగు చూసిన ఈ జంట హత్యల ఉదంతం స్థానికంగా తీవ్ర సంచలనం రేపుతోంది. తాండూరు ప్రాంతానికి చెందిన ఇద్దరు వృద్ధ మహిళల నుంచి నిందితులు గతంలో అప్పులు

మిగతా 2లో

### కేంద్ర మంత్రి బండి సంజయ్ ను

# కేబినెట్ నుంచి తప్పించాలి

### ప్రధానిని కోరిన కల్వకుంట్ల కవిత

**మహా :** కేంద్ర మంత్రి తనయుడిపై పోక్సో కేసు నమోదు అయిన నేపథ్యంలో విచారణ నిష్పాక్షికంగా జరగడానికి సంజయ్ ను కేంద్ర మంత్రివర్గం నుంచి తప్పించాలని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. శనివారం ఆమె స్పందించారు.

### హైదరాబాద్‌లో

# కలకలం రేపిన జంట హత్యలు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నారు. అయితే, తీసుకున్న సొమ్మును తిరిగి ఇచ్చే ఉద్దేశం లేని సదరు వ్యక్తులు, ఆ మహిళలు అప్పు తీర్చాలని అడుగుతుండటంతో వారిని అడ్డు తొలగించుకోవాలని కుట్ర పన్నారు. పథకం ప్రకారం తాండూరులో ఆ ఇద్దరు వృద్ధ మహిళలను కిడ్నాప్ చేసిన దుండగులు, వారిని అత్యంత దారుణంగా హత్య చేశారు. అనంతరం ఆధారాలు మాయం చేసే ఉద్దేశంతో, మృతదేహాలను గుట్టుచప్పుడు కాకుండా మొయినాబాద్‌లోని ఓ ఫామ్‌హౌస్ సమీపానికి తరలించారు. అక్కడ ముందుగానే గోతులు తీసి మృతదేహాలను పూడ్చిపెట్టారు. వృద్ధ మహిళలు అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు లోతైన దర్యాప్తు చేపట్టడంతో ఈ దారుణ కాండ వెలుగులోకి వచ్చింది. సాంకేతిక ఆధారాలు, కాల్ డేటా తదితర వివరాల ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులకు విస్తుపోయే నిజాలు తెలిశాయి. ఆ మహిళల నుంచి పెద్ద ఎత్తున అప్పులు తీసుకున్న వ్యక్తులే ఈ కిడ్నాప్, హత్యలకు పాల్పడినట్లు పోలీసులు పక్కాగా గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా మొయినాబాద్ ఫామ్‌హౌస్ వద్ద మృతదేహాలను పూడ్చిపెట్టిన విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో పూడ్చిపెట్టిన మృతదేహాలను వెలికితీసేందుకు చర్యలు చేపట్టారు. డబ్బు కోసం ఇంతటి అమానుషానికి ఒడిగట్టి, అత్యంత పాశవికంగా ప్రాణాలు తీసిన నిందితులను కఠినంగా శిక్షించాలని స్థానికులు తీవ్ర స్థాయిలో డిమాండ్ చేస్తున్నారు. కిడ్నాప్ చేసిన విధానం, హత్యకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు అన్ని కోణాల్లో తదుపరి దర్యాప్తును వేగవంతం చేశారు.

### ప్రైవేట్ థియేటర్‌ను ప్రారంభించిన

# కుడా చైర్మన్ ఇనగాల

**మహా వరంగల్ బ్యూరో;** భద్రకాళి బండ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 'హ్యాపీ మూమెంట్స్' ప్రైవేట్ థియేటర్‌ను కుడా చైర్మన్, హనుమకొండ డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ భద్రకాళి బండ్ ప్రాంతం వరంగల్ నగరంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా మారుతోందని, ఇలాంటి ఆధునిక వినోద కేంద్రాలు రావడం వల్ల స్థానికులతో పాటు పర్యాటకులకు కూడా మంచి అనుభూతి లభిస్తుందని ఇనగాల పేర్కొన్నారు. స్థానికంగా యువత ఇటువంటి సరికొత్త స్టార్టప్స్, వ్యాపార ఆలోచనలతో ముందుకు రావడం అభినందనీయమని, దీనివల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. నగరంలో సరికొత్త వ్యాపారాలు, వినోద రంగాలు నెలకొల్పే యువ పారిశ్రామిక వేత్తలకు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రభుత్వం తరపున పూర్తి మద్దతు ఉంటుందని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డిసిసి అధ్యక్షులు అయ్యూబ్ , కార్యనిర్వాహకులు పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు డిసిసి అధ్యక్షులను గజమాలతో సత్కరించారు.

# అండమాన్‌ను తాకిన నైరుతి రుతుపవనాలు

- ఈనెల 26నే కేరళ తీరానికి వర్షాలు
- అండమాన్, నికోబార్ దీవుల్లో దంచికొడుతున్న వానలు
- ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు అతిపెద్ద ఉపశమనం
- ఖరీఫ్ వ్యవసాయానికి అత్యంత సానుకూల వాతావరణం



**హైదరాబాద్, మహా:** దేశ ప్రజలకు, ముఖ్యంగా అన్నదాతలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అత్యంత చల్లని కబురు అందించింది. భానుడి భగభగలు, తీవ్రమైన వడగాల్పులతో అల్లాడిపోతున్న ప్రజలకు ఊరట నిస్తూ నైరుతి రుతుపవనాలు భారత భూభాగంలోకి ప్రవేశించాయి. ముందస్తు అంచనాలకు అనుగుణంగానే వ్యవహరిస్తున్న నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవులను తాకాయి. దీని ప్రభావంతో ప్రస్తుతం అండమాన్, నికోబార్ దీవుల వ్యాప్తంగా విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయి. నైరుతి గాలులు అత్యంత చురుగ్గా కదులుతుండటంతో రాబోయే రెండ్రోజుల్లో బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలకు, అరేబియా సముద్రంలోని దక్షిణ భాగాలకు రుతుపవనాలు విస్తరించేందుకు వాతావరణం అత్యంత అనుకూలంగా ఉందని వాతావరణ శాఖ అధికారులు అధికారికంగా ప్రకటించారు. సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ 1వ తేదీ నాటికి కేరళ తీరాన్ని తాకడం ఆనవాయితీ. అయితే, ఈ ఏడాది రుతుపవనాల రాక మరింత ముందుగానే ఉండబోతోందని వాతావరణ శాఖ విశ్లేషిస్తోంది. ప్రస్తుతం గాలుల గమనం, సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు రుతుపవనాల పురోగతికి అద్భుతంగా సహకరిస్తుండటంతో, ఈనెల 26వ తేదీ నాటికే కేరళ రాష్ట్రాన్ని తొలికరి పలుకరించనుందని వాతావరణ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అంచనాల ప్రకారం ఈ నెలాఖరు నాటికి కేరళతో పాటు తమిళనాడు, కర్ణాటకలోని పలు ప్రాంతాలకు ఈ వర్షాలు విస్తరించే అవకాశం ఉంది. ఏదేమైనా ఐదారు రోజుల ముందే రుతుపవనాలు కేరళను తాకుతుండటం దేశ వ్యవసాయ రంగానికి అత్యంత శుభసూచకమని నిపుణులు భావిస్తున్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల వల్ల దేశవ్యాప్తంగా సాధారణం కంటే మెరుగైన (అధిక) వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రాథమిక అంచనాలను విడుదల చేసింది. ఎల్‌నినో ప్రభావం పూర్తిగా క్షీణించి, వర్షాలకు అనుకూలించే లానినా పరిస్థితులు పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. దేశ వ్యవసాయ రంగం, ఆర్థిక వ్యవస్థ పూర్తిగా నైరుతి రుతుపవనాలపైనే ఆధారపడి ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు రుతుపవనాలు ముందస్తుగా వస్తుండటంతో దేశవ్యాప్తంగా ఖరీఫ్ సాగు పనులు వేగవంతం కానున్నాయి. ముఖ్యంగా వరి, పత్తి, మొక్కజొన్న, ఇతర వాణిజ్య పంటల సాగుకు రైతులు ముందుగానే సన్నద్ధం అయ్యేందుకు ఈ వర్షాలు ఎంతో దోహదపడతాయి. మరోవైపు దేశంలోని పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. తీవ్రమైన వడగాల్పులతో జనం పిట్టల్లా రాలిపోతున్న పరిస్థితులు ఉన్నాయి. జలాశయాలన్నీ అడుగంటిపోయి తీవ్రమైన తాగు, సాగు నీటి ఎద్దడి నెలకొంది. భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయాయి. ఇలాంటి కరువు పరిస్థితుల నేపథ్యంలో నైరుతి రుతుపవనాల ముందస్తు రాక అమృతధారగా మారనుంది. రుతుపవనాల రాకతో క్రమంగా ఉష్ణోగ్రతలు తగ్గి వాతావరణం చల్లబడటమే కాకుండా, ఎండిపోయిన జలాశయాలు తిరిగి జలకళను సంతరించుకుంటాయి. వాతావరణ శాఖ తాజా ప్రకటనతో దేశవ్యాప్తంగా సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

# చట్టం ముందు అందరూ సమానులే!

### కుమారుడి లొంగుబాటుపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక ప్రకటన

తప్పు చేయలేదని నా బిడ్డ పదేపదే చెబుతున్నాడు.. న్యాయవ్యవస్థపై నాకు సంపూర్ణ నమ్మకం ఉంది

ఆధారాలు చూసి బెయిల్ వస్తుందని లాయర్లు చెప్పడం వల్లే విచారణకు పంపడంలో కొంత జాప్యం

**హైదరాబాద్, మహా:** తన కుమారుడు బండి భగీరథ్ పోలీసుల ఎదుట లొంగిపోయిన పరిణామాలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పందించారు. "సత్యమేవ జయతే" అంటూ తన అంతరంగాన్ని మీడియా ముఖంగా పంచుకున్నారు. చట్టంపై ఉన్న అపారమైన గౌరవంతోనే తన కుమారుడిని ఈరోజు న్యాయవాదుల ద్వారా పోలీసుల విచారణ నిమిత్తం అప్పగించినట్లు ఆయన స్పష్టం చేశారు. చట్టం ముందు సామాన్యుడైనా, అధికారంలో ఉన్న నాయకుడి బిడ్డైనా సమానమేనని, దేశంలో ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి తీరాల్సిందేనని ఆయన ఉద్ఘాటించారు. తన కుమారుడు భగీరథ్ ఎలాంటి తప్పు చేయలేదని పదేపదే చెబుతున్నాడని బండి సంజయ్ పేర్కొన్నారు. వాస్తవానికి తన కుమారుడిపై ఫిర్యాదు వచ్చిన వెంటనే పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని తాను దృఢంగా నిర్ణయించుకున్నట్లు బండి సంజయ్ వెల్లడించారు. అయితే, ఇదే సమయంలో న్యాయవాదులను సంప్రదించి తమ వద్ద ఉన్న పక్కా ఆధారాలను వారి ముందు ఉంచామని తెలిపారు. ఆ ఆధారాలను నిశితంగా పరిశీలించిన న్యాయవాదులు ఆరోపణలు నిలబడవని, కేసును కొట్టేస్తారని, తప్పకుండా బెయిల్ వస్తుందని భరోసా ఇచ్చారని, కేవలం ఆ న్యాయపరమైన సంప్రదింపుల కారణం చేతనే లొంగుబాటులో కొంత జాప్యం జరిగిందని ఆయన అసలు విషయాన్ని వివరించారు. ఈరోజు కూడా బెయిల్ వస్తుందనే పూర్తి నమ్మకంతో లాయర్లు ఉన్నారని బండి సంజయ్ తెలిపారు. సోమవారం నాడు కోర్టు నుంచి బెయిల్ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నప్పటికీ, న్యాయవ్యవస్థపై తనకు సంపూర్ణమైన నమ్మకం, అపారమైన గౌరవం ఉన్నందున ఇక ఏమాత్రం జాప్యం చేయడం సరికాదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఆ సదుద్దేశంతోనే తన అబ్బాయిని స్వయంగా తీసుకొచ్చి లాయర్ల ద్వారా పోలీసులకు విచారణ కోసం అప్పగించినట్లు ఆయన స్పష్టం చేశారు.

### సంక్షోభం తలెత్తినా దేశానికి

# ఇక నో టెన్షన్...

(మొదటిపేజీ తరువాయి)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల యూఏఈ పర్యటన ముగించుకున్న వెంటనే ఈ అద్భుతమైన ఒప్పందం కుదిరింది. నవభారత దౌత్య సత్తా ఏమిటో ప్రపంచానికి చాటిచెప్పిన ఈ ఒప్పందం ప్రకారం.. అబుదాబీ నేషనల్ ఆయిల్ కంపెనీ భారతదేశానికి చెందిన 'స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్స్' (వ్యూహాత్మక చమురు నిల్వలు) లో ఏకంగా 30 మిలియన్ బారెళ్ల ముడి చమురును నిల్వ చేయడానికి సిద్ధమైంది.

**పన్ను చెల్లింపుదారులపై ఒక్క రూపాయి భారం లేదు**

ఈ ఒప్పందం భారతదేశానికి వంద శాతం అత్యంత లాభదాయకంగా రూపొందింది. మన దేశంలో చమురు నిల్వ చేయడానికి అయ్యే మౌలిక వసతుల ఖర్చుతో సహా మొత్తం వ్యయాన్ని యూఏఈ ప్రభుత్వమే స్వయంగా భరిస్తుంది. దీనివల్ల భారతీయ పన్ను చెల్లింపుదారులపై ఒక్క రూపాయి కూడా భారం పడదు. నిల్వ చేస్తున్న ఆ చమురుపై యాజమాన్య హక్కులు వారివే అయినప్పటికీ.. భారతదేశానికి ఏదైనా అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) వస్తే మాత్రం, మొదట ఆ చమురును వాడుకునే పరమ పవిత్రమైన హక్కును భారత్‌కే కల్పించారు. అంతర్జాతీయంగా చమురు సరఫరా ఎక్కడైనా నిలిచిపోయినా, మనకు తక్షణ ఇంధన భద్రత లభించేలా అత్యంత పక్కాగా ఈ ఒప్పందాన్ని రచించారు. ముడి చమురుతో పాటు వ్యూహాత్మక గ్యాస్ నిల్వలు, దీర్ఘకాలిక ఎల్‌పీజీ సరఫరాలపై కూడా ఇరు దేశాల మధ్య కీలక అడుగులు పడ్డాయి.

**దేశానికి ప్రాణదాత**

ఈ ఒప్పందం భారత్‌కు ఎందుకు అంత కీలకం అంటే.. 30 మిలియన్ బారెల్స్ చమురు అనేది భారతదేశం యొక్క మొత్తం ఐదారు రోజుల వినియోగంతో సమానం. ప్రపంచవ్యాప్తంగా ఏదైనా భారీ యుద్ధం వచ్చినా, గల్ఫ్ దేశాల వద్ద ఉండే కీలకమైన హోర్ముజ్ జలసంధి దిగ్బంధనానికి గురైనా, లేదా ఓపెక్ దేశాల్లో తీవ్రమైన సంక్షోభం తలెత్తినా భారత్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అలాంటి అత్యవసర సమయాల్లో చమురు ట్యాంకర్ల కోసం ఇతర దేశాల వద్ద చేయిచాపాల్సిన పనిలేదు. మన సొంత గడ్డపై మన కళ్లెదుటే సిద్ధంగా ఉన్న ఈ 30 మిలియన్ బారెళ్ల నిల్వలను నేరుగా వాడుకుని దేశ ఆర్థిక వ్యవస్థను, రవాణాను స్తంభించిపోకుండా కాపాడుకోవచ్చు.

**పెద్ద వ్యూహం**

యూఏఈ ఈ ఒప్పందానికి ఎందుకు అంగీకరించిందనే దాని వెనుక అతిపెద్ద వ్యూహం దాగి ఉంది. గల్ఫ్ దేశాల నుండి చమురు ఎగుమతి చేసే సముద్ర మార్గాల్లో దశాబ్దాలుగా తీవ్రమైన భద్రతా లోపాలు, ముప్పు పొంచి ఉన్నాయి. ఈ రిస్క్‌ను అబుదాబీ దేశం ఇప్పుడు అధిగమించింది. సురక్షితమైన భారత గడ్డపై ఆ చమురును దాచుకుని తమ భద్రతను ఖాయం చేసుకుంటే, వారికి ఆ ఆశ్రయం కల్పించినందుకు ప్రతిఫలంగా అత్యవసర పరిస్థితుల్లో వాడుకునే ప్రయోజనం భారత్‌కు దక్కుతుంది. ఇది దాతృత్వం ఎంతమాత్రం కాదు.. అత్యంత పక్కాగా, వ్యూహాత్మకంగా సాగిన చమురు దౌత్యం . యూఏఈ తన రిస్క్‌ను తగ్గించుకుంటే, భారత్ వేరొకరి ఖర్చుతో తన ఇంధన బలాన్ని భారీగా పెంచుకుంది. ప్రపంచమంతా మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలను చూసి ఆందోళన చెందుతుంటే, భారత్ మాత్రం అద్భుతమైన వ్యూహంతో తన ఇంధన భద్రతను సుస్థిరం చేసుకుంది. దశాబ్దాల తరబడి చేసిన చర్చలు సాధించలేని వ్యూహాత్మక లోతును, ప్రధాని మోదీ గారి ఈ ఒక్క పర్యటన సాధించి చూపించింది. భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి ఇంధన విపత్తు వచ్చినా భారత్ ఏమాత్రం ఇబ్బంది పడదు.. ఎందుకంటే ఆ లక్షలాది బారెళ్ల చమురు నిల్వల తాళాలు ఇప్పటికే మన చేతికి వచ్చేశాయి.

# సీబీఎస్ఈ సంచలన నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేస్తూ బోర్డు తాజాగా సర్క్యులర్ జారీ చేసింది.

**రెండు భారతీయ భాషలు.. ఒక విదేశీ భాష**

తాజా మార్గదర్శకాల ప్రకారం 9, 10 తరగతుల విద్యార్థులు తప్పనిసరిగా మూడు భాషలను అభ్యసించాల్సి ఉంటుంది. ఇందులో కనీసం రెండు భాషలు మాతృభాష లేదా ఏదైనా భారతీయ భాష (ఉదాహరణకు తెలుగు, హిందీ, సంస్కృతం తదితర ప్రాంతీయ భాషలు) అయి ఉండాలని సీబీఎస్ఈ స్పష్టమైన నిబంధన విధించింది. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న మూడో భాషగా ఏదైనా ఒక విదేశీ భాషను ఎంచుకునే వెసులుబాటును కల్పించింది. ఈ విధానం వల్ల విద్యార్థులు తమ మాతృభాష, జాతీయ భాషలతో పాటు అంతర్జాతీయ స్థాయికి అవసరమైన విదేశీ భాషల పట్ల కూడా పట్టు సాధించే అవకాశం కలుగుతుందని విద్యావేత్తలు విశ్లేషిస్తున్నారు.

**భాషా నైపుణ్యాల పెంపుకే పెద్దపీట**

ఇప్పటివరకు సీబీఎస్ఈ పాఠశాలల్లో 8వ తరగతి వరకే త్రిభాషా విధానం అమలులో ఉండగా, 9, 10 తరగతుల్లో ప్రధానంగా ద్విభాషా (రెండు భాషలు) విధానమే కొనసాగుతోంది. అయితే విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, వారిలో సృజనాత్మక ఆలోచనా విధానాన్ని మెరుగుపరచడానికి బహుళ భాషా పరిజ్ఞానం ఎంతో దోహదపడుతుందని గుర్తించిన బోర్డు ఈ కీలక మార్పుకు నాంది పలికింది. విభిన్న సంస్కృతులు, భాషల కలయికగా ఉన్న భారతదేశంలో విద్యార్థులు ఇతర ప్రాంతాల భాషలను కూడా నేర్చుకోవడం ద్వారా జాతీయ సమైక్యత మరింత బలపడుతుందని బోర్డు లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచ స్థాయి పోటీని తట్టుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దడమే ఈ సంస్కరణ ముఖ్య ఉద్దేశమని సీబీఎస్ఈ స్పష్టం చేసింది.

**ముందస్తు సన్నద్ధతకు తగినంత సమయం**

ఈ త్రిభాషా విధానాన్ని హడావిడిగా అమలు చేయకుండా, పాఠశాలలు మరియు విద్యార్థులు మానసికంగా, విద్యాపరంగా సన్నద్ధమయ్యేందుకు తగినంత సమయం ఇస్తూ 2026 జూలై నుంచి అమలు చేయనున్నట్లు సీబీఎస్ఈ ప్రకటించింది. ఈ నూతన మార్పులకు అనుగుణంగా పాఠ్యాంశాల రూపకల్పన, అవసరమైన భాషా ఉపాధ్యాయుల నియామకం, బోధనా పద్ధతుల్లో మార్పులు చేసుకునేందుకు యాజమాన్యాలకు వెసులుబాటు కల్పించింది. సీబీఎస్ఈ తీసుకున్న ఈ సంచలన నిర్ణయంతో దేశవ్యాప్తంగా ఉన్న వేలాది స్కూళ్లలో విద్యాబోధనలో సమూల మార్పులు రానున్నాయి.

# వెండి దిగుమతులపై నిషేధం

(మొదటిపేజీ తరువాయి)

వెళ్లిపోతోంది. దీనివల్ల దేశ ఆర్థిక స్థిరత్వానికి ముప్పు వాటిల్లుతుందని గ్రహించిన కేంద్ర ప్రభుత్వం ఈ మాస్టర్ స్ట్రోక్ వేసింది. ముందస్తు ప్రభుత్వ లైసెన్స్ లేదా అనుమతులు లేకుండా ఎలాంటి వెండిని స్వేచ్ఛగా దిగుమతి చేసుకోకూడదని డీజీఎఫ్‌టీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సెజ్ యూనిట్లు, ఎగుమతి ఆధారిత సంస్థల మినహా, సాధారణ కొనుగోలుదారులు, వ్యాపారులకు ఈ నిషేధం వర్తిస్తుందని నిబంధనలను కఠినతరం చేసింది. ఉత్పాదకత లేని ఈ దిగుమతులను దాదాపుగా నిషేధిత జాబితాలోకి నెట్టేసినట్లు ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**బంగారం దిగుమతి సుంకం 15 శాతానికి పెంపు**

వెండిపై ఆంక్షలు విధించడానికి కొద్ది రోజుల ముందే, కేంద్ర ప్రభుత్వం బంగారం దిగుమతి సుంకం పై కూడా సంచలన నిర్ణయం తీసుకుంది. దేశంలోకి పసిడి దిగుమతులను భారీగా నిరుత్సాహపరచాలనే ఉద్దేశంతో, కస్టమ్స్ డ్యూటీని ఏకంగా 6 శాతం నుంచి 15 శాతానికి పెంచుతూ ఆర్థిక శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. గతంలో ఆభరణాల రంగానికి ఊరటనిస్తూ ఈ సుంకాన్ని 6 శాతానికి తగ్గించిన ప్రభుత్వం, మారుతున్న ప్రపంచ ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా ఇప్పుడు మళ్లీ దాన్ని 2022 నాటి గరిష్ట స్థాయి అయిన 15 శాతానికి అమాంతం పెంచేసింది. వ్యవసాయ మౌలిక సదుపాయాల సెస్ సామాజిక సంక్షేమ సర్ ఛార్జ్ తదితర పన్నులన్నీ కలిపి ఈ సుంకం 15 శాతానికి చేరింది.

**ప్రధాని మోదీ పిలుపు.. ఆ వెంటే కఠిన నిర్ణయాలు**

దేశ ఆర్థిక ప్రయోజనాల దృష్ట్యా, జాతీయ ప్రయోజనాల కోసం కనీసం ఏడాది పాటు పౌరులెవరూ అత్యవసరం కాని బంగారం కొనుగోళ్లు చేయవద్దని సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రధాని ఆ ప్రకటన చేసిన కొద్ది రోజుల వ్యవధిలోనే కేంద్రం ఈ స్థాయిలో పన్నులు పెంచడం, వెండిపై నిషేధాస్త్రాలు ప్రయోగించడం గమనార్హం. కేవలం ముడి చమురు, రక్షణ పరికరాలు, ఎరువులు, పారిశ్రామిక ముడిసరుకు లాంటి అత్యవసర వస్తువుల దిగుమతులకే విదేశీ మారక ద్రవ్యాన్ని అత్యధికంగా వినియోగించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, దిగుమతి సుంకాలు ఈ స్థాయిలో పెంచడం, ముడి వెండిపై ఆంక్షలు విధించడం వల్ల దేశంలోకి అక్రమ రవాణా (స్మగ్లింగ్) భారీగా పెరిగే ప్రమాదం ఉందని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ వర్గాలు ముందస్తు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఏదేమైనా కేంద్రం తీసుకున్న ఈ వరుస తాజా నిర్ణయాలు దేశీయ మార్కెట్‌లో బులియన్ ధరల మంట పుట్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

### ఓటర్ల జాబితా సమగ్ర ప్రక్షాళనకు

# మోగిన నగారా

(మొదటిపేజీ తరువాయి)

ఇదే సమయంలో జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు ఈ అభ్యంతరాలపై విచారణ, నోటీసుల జారీ, పరిష్కారం లాంటి కీలక ఘట్టాలను పూర్తి చేసి, చివరగా అక్టోబర్ 1వ తేదీన తుది ఓటర్ల జాబితాను పకడ్బందీగా పబ్లిష్ చేయనున్నారు. ఈ భారీ సవరణ క్రతువులో బూత్ స్థాయి అధికారుల (బీఎల్‌వో) పాత్ర అత్యంత కీలకమని అధికారులు వివరించారు. వీరు ప్రతి ఓటరు ఇంటికి కనీసం మూడుసార్లు స్వయంగా వెళ్లి, ఎన్యూమరేషన్ ఫారాలను అందజేసి, వాటిని పూర్తి చేయడంలో సహాయపడతారు. అయితే సాంకేతికతను అందిపుచ్చుకుంటూ, భారత ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఓటర్లు నేరుగా ఆన్‌లైన్‌లోనూ తమ ఫారాలను సమర్పించే అద్భుత సదుపాయాన్ని కల్పించారు. సందేహాల నివృత్తికి 1950 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చని, లేదా వెబ్‌సైట్ ద్వారా బీఎల్‌వోతో మాట్లాడే (బుక్ ఏ కాల్ విత్ బీఎల్‌వో) వెసులుబాటు ఉందని తెలిపారు. గుర్తింపు దశలో ఎలాంటి పత్రాలు అడగనప్పటికీ.. ముసాయిదా జాబితా విడుదలయ్యాక వివరాల్లో వ్యత్యాసాలు ఉంటే మాత్రం కచ్చితమైన నిబంధనలతో ధృవీకరణ పత్రాలు సమర్పించాల్సిందే. 1987 జూలై 1కి ముందు పుట్టిన వారు సొంత పత్రాలు ఇస్తే సరిపోతుంది. కానీ, 1987 నుంచి 2004 డిసెంబర్ 2 మధ్య పుట్టిన వారు తమ పత్రాలతో పాటు తల్లి లేదా తండ్రి ధృవీకరణ కూడా జతచేయాలి. ఇక 2004 డిసెంబర్ 2 తర్వాత పుట్టిన యువత తప్పనిసరిగా తల్లిదండ్రులిద్దరి ధృవీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. రాష్ట్ర ఎన్నికల ముఖచిత్రాన్ని, ఓటర్ల గణాంకాలను సీఈఓ సుదర్శన్ రెడ్డి ఈ సందర్భంగా సవివరంగా మీడియా ముందుంచారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రస్తుతం రికార్డు స్థాయిలో మూడు కోట్ల ముప్పై తొమ్మిది లక్షల ఇరవై నాలుగు వేల ఆరు వందల అరవై నాలుగు (3,39,24,664) మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 1.68 కోట్లు ఉండగా, మహిళా ఓటర్లు వారిని అధిగమిస్తూ 1.71 కోట్లకు పైగా నమోదు కావడం విశేషం. వీరితో పాటు దాదాపు మూడు వేల మంది థర్డ్ జెండర్ ఓటర్లు, ఐదు లక్షల ఇరవై రెండు వేల మంది దివ్యాంగులు, ఎనిమిది లక్షల పద్దెనిమిది వేల మంది యువ ఓటర్లు జాబితాలో ఉన్నారు. ఈ భారీ జాబితాను ప్రక్షాళన చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 35,985 పోలింగ్ కేంద్రాల పరిధిలో అంతే సంఖ్యలో బీఎల్‌వోలు, 33 మంది జిల్లా ఎన్నికల అధికారులు, 119 మంది ఈఆర్‌వోలు రేయింబవళ్లు శ్రమించనున్నారు. ముందస్తు ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో యంత్రాంగం ఇప్పటికే అద్భుతమైన పురోగతి సాధించింది. రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో ఏకంగా 64.38 శాతం మంది (అంటే సుమారు రెండు కోట్ల పద్దెనిమిది లక్షల పైచిలుకు ఓటర్ల) మ్యాపింగ్ విజయవంతంగా పూర్తయినట్లు సీఈఓ ప్రకటించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఈ సవరణ అవకాశాన్ని అర్హులైన పౌరులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# మూడో బిడ్డ పుడితే రూ.30 వేలు

- నాలుగో బిడ్డకు రూ.40 వేల నజరానా
- చంద్రబాబు సంచలన ప్రకటన
- తగ్గుతున్న జనాభా రేటుపై ఆందోళన..




**అమరావతి, మహా:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో క్రమంగా తగ్గుతున్న జనాభా రేటును అరికట్టి, మానవ వనరులను పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త అడుగులు వేస్తోంది. పిల్లలు కుటుంబానికి గానీ, దేశానికి గానీ భారం కాదని, వారే మనకు అసలైన సంపద అని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కుటుంబ నియంత్రణ విధానాల వల్ల రాష్ట్రంలో జనాభా సమతుల్యత దెబ్బతింటున్న నేపథ్యాన్ని తీవ్రంగా పరిగణించిన ఆయన, జనాభా పెంపును ప్రోత్సహించేలా చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో శనివారం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మూడో బిడ్డ పుట్టిన వెంటనే ఆ కుటుంబానికి రూ.30 వేలు, నాలుగో బిడ్డ పుట్టిన వెంటనే రూ.40 వేల ఆర్థిక సాయం అందజేస్తామని సంచలన ప్రకటన చేశారు. ఈ నూతన విధానానికి సంబంధించిన పూర్తి విధివిధానాలను రాబోయే నెల రోజుల్లోనే ప్రజల ముందుకు తీసుకువస్తామని ఆయన వెల్లడించారు.

ఒకప్పుడు జనాభా నియంత్రణ కోసం కఠిన నిబంధనలు అమలు చేసిన ప్రభుత్వాలు, ఇప్పుడు అదే జనాభాను పెంచుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తిస్తున్నాయి. రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు (టోటల్ ఫెర్టిలిటీ రేట్ TFR) భర్తీ స్థాయికి తగ్గిపోతుండటం పట్ల సీఎం చంద్రబాబు గత కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధుల సంఖ్య పెరిగిపోయి, యువత శాతం తగ్గిపోతే భవిష్యత్తులో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుందని, ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఇప్పుడు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాయని ఆయన విశ్లేషించారు. సమాజంలో ఆర్థిక స్తోమత పెరగడం, మారుతున్న జీవనశైలి కారణంగా అనేక కుటుంబాలు కేవలం ఒక బిడ్డకే పరిమితం అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ధోరణిని మార్చేందుకే ఆర్థిక ప్రోత్సాహకాలతో కూడిన విధానాన్ని తెరపైకి తెచ్చినట్లు ముఖ్యమంత్రి వివరించారు.

ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో రెండో బిడ్డ పుడితే రూ.25 వేలు ఆర్థిక సాయం అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. దాని కొనసాగింపుగానే, ఇప్పుడు మూడో బిడ్డ, నాలుగో బిడ్డకు కూడా మరింత మెరుగైన ప్రోత్సాహకాలను ఆయన ప్రకటించారు. సమాజ మనుగడకు, రాష్ట్ర ప్రగతికి జనాభా సమతుల్యత అత్యంత కీలకమని, అందుకే పిల్లల్ని భారం అనుకోకుండా సంపదగా భావించి కనాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. భవిష్యత్తులో మానవ వనరులు పుష్కలంగా ఉంటేనే ఏ రాష్ట్రమైనా, దేశమైనా ప్రగతిపథంలో దూసుకుపోగలదని చంద్రబాబు ఉద్ఘాటించారు. ఇదే సభలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న 'తల్లికి వందనం' పథకంపై కూడా ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. చదువుకునే పిల్లల తల్లులకు ప్రస్తుతం ఏడాదికి రూ.15 వేల చొప్పున ఇవ్వాలని నిర్ణయించామని, భగవంతుడి దయతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిలో పడి, ఆదాయం పెరిగితే భవిష్యత్తులో ఈ పథకం కింద ఇచ్చే మొత్తాన్ని మరింతగా పెంచుతామని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి జనాభా ప్రోత్సాహకాలపై చేసిన ఈ ప్రకటనకు సభలో ఉన్న ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, కరతాళ ధ్వనులతో ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. ఏళ్ల తరబడి కుటుంబ నియంత్రణ పాటిస్తూ వచ్చిన దక్షిణాది రాష్ట్రాల్లో, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు జాతీయ స్థాయిలోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# రోడ్డున పడ్డ సినీ జీవితం

- హృదయవిదారక స్థితిలో సీనియర్ నటి పావలా శ్యామల
- డబ్బు లేదని వైద్యానికి నిరాకరించిన ప్రైవేట్ ఆసుపత్రి
- ఫుట్‌పాత్‌పై అనాథలా పడి ఉన్న వైనం.. కలచివేస్తున్న దుస్థితి.
- స్థానికులు, పోలీసుల చొరవతో ఆర్కే ఫౌండేషన్‌కు తరలింపు



**హైదరాబాద్, మహా:** వెండితెరపై తనదైన శైలిలో హాస్యాన్ని పండించి, ఎన్నో దశాబ్దాల పాటు తెలుగు ప్రేక్షకులను అలరించిన సీనియర్ నటి పావలా శ్యామల జీవితం అత్యంత విషాదాంతంగా మారింది. ఒకప్పుడు సినిమా షూటింగ్‌లతో బిజీగా గడిపిన ఆమె, నేడు పూట గడవని దయనీయ స్థితిలో, ప్రాణాపాయంలో కనీస వైద్యం కూడా నోచుకోలేని అభాగ్యురాలిగా రోడ్డున పడ్డారు. గుండె సంబంధిత తీవ్రమైన వ్యాధితో బాధపడుతున్న ఆమెను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అర్ధరాత్రి వేళ నడిరోడ్డుపై ఫుట్‌పాత్ మీద ప్రాణాపాయ స్థితిలో ఆమె పడి ఉన్న వైనం ప్రతి ఒక్కరినీ తీవ్రంగా కలచివేస్తోంది. గత కొంతకాలంగా తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న పావలా శ్యామల పరిస్థితి మరింత విషమించింది. గుండె సంబంధిత సమస్య తీవ్రమవడంతో ప్రాణాలు దక్కించుకునేందుకు ఆమె కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. అయితే, ఆసుపత్రి యాజమాన్యం అత్యంత అమానుషంగా వ్యవహరించింది. చికిత్స కోసం చెల్లించడానికి ఆమె వద్ద తగినంత డబ్బు లేకపోవడంతో, వైద్యం చేయడానికి నిరాకరించి ఆమెను నిర్దాక్షిణ్యంగా బయటకు పంపేసింది. ఎన్నో ఏళ్ల పాటు కళామతల్లికి సేవ చేసిన ఒక సీనియర్ నటి పట్ల కనీస మానవత్వం కూడా చూపకుండా ఆసుపత్రి వర్గాలు వ్యవహరించిన తీరు సర్వత్రా విమర్శల పాలవుతోంది. ఆసుపత్రి నుంచి నిరాశగా బయటకు వచ్చిన పావలా శ్యామల, కనీసం నడవలేని స్థితిలో కూకట్‌పల్లి ప్రాంతంలోని ఓ జంక్షన్ వద్ద ఫుట్‌పాత్‌పైనే కుప్పకూలిపోయారు. అర్ధరాత్రి సమయంలో చలిలో వణుకుతూ, తీవ్ర అస్వస్థతతో దీనంగా పడి ఉన్న ఆమెను అటుగా వెళ్తున్న కొందరు స్థానికులు గమనించారు. ఆమెను చూసి చలించిపోయిన వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు, ఆమె పరిస్థితిని చూసి ఆవేదన వ్యక్తం చేశారు. కనీస సపర్యలు చేసేవారు కూడా లేని ఆ దీన స్థితి నుంచి ఆమెను రక్షించి, వెంటనే మెరుగైన ఆశ్రయం కోసం ఆర్కే ఫౌండేషన్‌కు తరలించారు. వందలాది చిత్రాల్లో నటించి, ప్రేక్షకుల పెదవులపై నవ్వులు పూయించిన పావలా శ్యామల నేడు కన్నీటి సంద్రంలో కూరుకుపోవడం తెలుగు చిత్రసీమలోని విషాద ఛాయలకు అద్దం పడుతోంది.


ANN
TELUGU
ANN MAHAA
AWARDS
VIJAYAWADA
UNDAVALLI CAVES

# ఎడ్లబండ్లపై దూసుకెళ్ళిన లారీ

- మూగజీవాలకు తీవ్ర గాయాలు
- వేగంగా వచ్చి ఢీకొట్టిన భారీ వాహనం
- నొప్పితో విలవిల్లాడిన మూగజీవాలు..
- రైతుకంట కన్నీరు
- ములకలపల్లి వద్ద లారీని పట్టుకున్న పోలీసులు




**దమ్మపేట, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట గ్రామ శివారులో శనివారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. మితిమీరిన వేగంతో దూసుకొచ్చిన ఒక లారీ.. రోడ్డుపై వెళ్తున్న రెండు ఎడ్ల బండ్లను బలంగా ఢీకొట్టి బీభత్సం సృష్టించింది. లారీ అతి వేగంగా ఢీకొట్టడంతో ఆ తాకిడికి రెండు ఎడ్లబండ్లు అక్కడికక్కడే ముక్కలై పూర్తిగా ధ్వంసమయ్యాయి .ఈ ప్రమాదంలో రెండు ఎద్దులకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. నిత్యం తమతో పాటు కష్టపడే మూగజీవాలు నొప్పితో విలవిల్లాడుతూ, రోడ్డుపై రక్తం ఓడుతూ పడి ఉండటాన్ని చూసి ఆ రైతులు గుండెలవిసేలాగా లబోదిబోమన్నారు. కంటిపాపలా సాదుకున్న జీవాల పరిస్థితి చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు.ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా అక్కడి నుంచి పరారయ్యాడు. అయితే, సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అలర్ట్ అయ్యారు. ములకలపల్లి వద్ద సదరు లారీని చాకచక్యంగా అడ్డుకుని, అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వాహనాన్ని దమ్మపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధం కావాలి..

- పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి..
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా



ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ..

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను అత్యధికంగా గెలుచుకునే లక్ష్యంతో పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. శనివారం మణుగూరు సీపీఐ కార్యాలయంలో జిల్లా సమితి సభ్యులు, మండల, పట్టణ కార్యవర్గ సమావేశం దుర్గ్యాల సుధాకర్, జక్కుల రాజబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తూ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని కోరారు. కార్మిక, కర్షక, రైతు, విద్యార్థి, మహిళ, యువజన సంఘాలను మరింత బలోపేతం చేస్తూ పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. పినపాక నియోజకవర్గ అభివృద్ధిలో సీపీఐ పాత్ర ఎంతో కీలకమైందని, గతంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, సొసైటీ చైర్మన్లను గెలిపించిన చరిత్ర సీపీఐకుందని గుర్తు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు దళారులకు తక్కువ ధరకే అమ్ముకొని నష్టపోతున్నారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే రైతుల వద్ద నుంచి నేరుగా వడ్లు కొనుగోలు చేయాలని, ప్రజాస్వామ్యబద్ధంగా ప్రాథమిక సహకార సంఘ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరు వెంకటేశ్వర రావు, రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్‌రావు, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, జిల్లా సమితి సభ్యులు వై రామ్‌గోపాల్, ఎడారి రమేష్, సోందే కుటుంబరావు, సీనియర్ నాయకులు ఎస్‌కే సర్వర్, మంగి వీరయ్య, కామిశెట్టి రామారావు, గద్దం వెంకటేశ్వర్లు, తోట రమేష్, చింతల దశరథం, కొత్తపల్లి సీతారాములు, వేర్పుల నరేష్, ఎస్‌వీ నాయుడు, పులిగల రమేష్, బాడిస సతీష్, నోముల రవి, వజ్జా వెంకటేశ్వర్లు, ఎలుక రాఘవులు, కనితి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీటి నాణ్యతపై బూర్గంపాడులో అవగాహన సదస్సు



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మరియు బూర్గంపాడు గ్రామపంచాయతీ పరిధిలో శనివారం మిషన్ భగీరథ నీటి నాణ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామపంచాయతీ సర్పంచ్ శ్రీ మందా నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం మిషన్ భగీరథ ఇంట్రా విభాగం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీరబ్రహ్మదేవ్ మరియు మండల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిషోర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేశారు.మిషన్ భగీరథ ఇంట్రా విభాగం మణుగూరు నీటి నాణ్యత పరీక్షల ప్రయోగశాల సిబ్బంది అహద్ పాషా, వెంకట్ మహారాజ్ ప్రజలకు భూగర్భ జలం, మినరల్ వాటర్ మరియు మిషన్ భగీరథ నీటి మధ్య ఉన్న తేడాలను వివరించారు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న నీరు పరిశుభ్రమైనదిగా, సురక్షితమైనదిగా ప్రభుత్వం నిరంతరం పరీక్షలు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తూ, ఆరోగ్యకరమైన జీవనం కోసం మిషన్ భగీరథ నీటిని వినియోగించాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న స్వచ్ఛమైన తాగునీటిని ఉపయోగించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, ఉపసర్పంచ్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మిక హక్కులకై ఏఐటీయూసీ పోరాటం..

- మణుగూరు ఏఐటీయూసీలో భారీ చేరికలు..
- సొంత గూటికి సుధాకర్ వర్గం..




**మణుగూరు, మహా :** సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు సంస్థ భవిష్యత్ కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తోందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచి కార్యదర్శి వై రాంగోపాల్ పేర్కొన్నారు. ఏరియాలోని మణుగూరు ఓసీలో శనివారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి యాజమాన్యంతో ఏఐటీయూసీ నాయకత్వం నిర్వహించిన సమావేశంలో కార్మికులకు సంబంధించిన పలు కీలక సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా మెడికల్ బోర్డు, డిపెండెంట్లకు నియామక పత్రాల జారీ, పెర్క్స్‌పై విధించిన 91 కోట్ల రూపాయల పన్ను భారం, కార్మికుల సొంతింటి కల నెరవేర్చడం వంటి అంశాలపై యాజమాన్యం సానుకూల హామీ ఇచ్చిందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు.ఈ సందర్భంగా మణుగూరు ఓసీకి చెందిన జి సుధాకర్, వెంకటేష్, అనిల్, సురేష్, దీపక్, అశోక్, శ్రీనివాస్ తదితరులు ఏఐటీయూసీలో చేరారు. వారికి నాయకులు వై రాంగోపాల్, ఆదెర్ల సురేందర్‌లు ఏఐటీయూసీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సమావేశంలో అసిస్టెంట్ పిట్ సెక్రటరీ సుధాకర్, ఉపేందర్ ఫోర్‌మన్, రాం బ్రహ్మం, మంద కోటేశ్వరరావు, రమేష్, సురేష్, పరమేష్, త్రినాథ్, శంకర్, సలీం పాషా, నవీన్, పాటి ప్రసాద్, బీచ్చు, రత్న తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విధానం వలన

# ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యం

### సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ప్రభుత్వం ఒకవైపున ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని విద్యారంగానికి కోట్లాది రూపాయలు బడ్జెట్ కేటాయించి ఖర్చు పెడుతున్నా మని ఐదు సంవత్సరాల నిండిన ప్రతి బాల బాలికను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఒకవైపు బడిబాటను మరొకవైపు విద్యా వారోత్సవాలను నిర్వహిస్తున్న తరుణంలో ప్రైవేటు పాఠశాలలను బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ గా ప్రతిపాదించి అందులో దళిత పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తాయని అందులో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోమని విద్యాశాఖ అధికారులే ఆహ్వానించడం హాస్యాస్పదంగా ఉందని సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విధానం వలన తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల మీద ఉన్న మోజుతో వ్యామోహంతో తమ పిల్లలను బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ లో చేర్పించడం వలన ప్రభుత్వ పాఠశాలలు ఖాళీ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రాథమిక విద్యావ్యవస్థను ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయడమేనని ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని శివకుమార్ డిమాండ్ చేశారు. ప్రైవేటు పాఠశాలల మీద ఉన్న వ్యామోహంతో గ్రామీణ ప్రాంతాల్లోని తల్లిదండ్రులు ఉచితమని తమ పిల్లలను బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ లో చేర్పించడానికి ఉత్సాహంతో ముందుకు వస్తున్నారని కానీ తమ పిల్లలను చేర్పించినాక కొంతకాలం తర్వాత ఏదో ఒక నెపంతో ఫీజులను పిండుతారని అంతేకాకుండా దూర ప్రాంతంలో ఉన్న ఈ బడులలో పిల్లలను చేర్పించడం వలన ఆటోలు ఎంజాయ్ చేసి ప్రతి నెల వేలాది రూపాయలు ఆటోలకు వెచ్చిస్తున్నారని అప్పుల పాలవుతున్నారని ఇది ఎంతో శోచనీయమని కాబట్టి ప్రైవేట్ పాఠశాలల్లో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ అనే విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసలు విద్య హక్కు చట్టం 2007 ప్రకారంగా ప్రతి ప్రైవేట్ స్కూల్లోనూ దళిత గిరిజన పేద విద్యార్థులకు 25 శాతం కోటాను అడ్మిషన్లుగా ఇవ్వాలని చట్టాన్ని పకడ్బందీగా అమలుపరిచేది మరిచిపోయి అస్తవ్యస్త మస్తిష్కాలతో కూడిన ఆలోచనలను రకరకాల ప్రయోగాలను విద్యావ్యవస్థలో చొప్పించడం అవివేకం అన్యాయమని పరిపాలకులు మేధావులు విద్యావ్యవస్థలో చేసే సంస్కరణలు పేద దళిత బడుగు బలహీన వర్గాలకు ఉపయోగపడే విధంగా ఉండాలి కానీ వారికి అన్యాయం జరిగే విధంగా ఉండకూడదు అని ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ హెచ్చరించారు.

# ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత

- తహసీల్దార్‌కు వినతి
- ఉప సర్పంచ్ గుండె వెంకన్న ఆధ్వర్యంలో లబ్ధిదారుల వినతిపత్రం



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత తీవ్రంగా ఉందని, వెంటనే పరిష్కరించాలని ఉప సర్పంచ్ గుండె వెంకన్న ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు, లబ్ధిదారులు శనివారం తహసీల్దార్ కె ఆర్ కె ప్రసాద్ కు వినతిపత్రం అందజేశారు.గతంలో ట్రక్కు ఇసుక ₹900 నుండి ₹1200 ఉండగా, ప్రస్తుతం ₹3000 నుండి ₹4000 వరకు పెరిగిందని, పేదలు కొనలేక ఇళ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయిందని తాసిల్దార్ దృష్టికి తీసుకెళ్లారు.వర్షాకాలం సమీపిస్తుండటంతో వరదలకు నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని తెలిపారు.గ్రామంలో మంజూరైన సీసీ రోడ్ల పనులు కూడా ఇసుక లేక ఆగిపోయాయని పేర్కొన్నారు.గతంలో పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఇసుక కూపన్లు అందజేసినట్లే, ప్రస్తుతం కూడా లబ్ధిదారులకు తక్కువ ధరకు ఇసుక సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజా ప్రభుత్వంలో పేదల సొంతింటి కల నెరవేరాలంటే ఇసుక సమస్య వెంటనే తీర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు రాజశేఖర్,ఆరీఫ్, నస్రీన్, శ్రీను,ఆకుల నారాయణమ్మ,,నాగం,ప్రవళిక, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక , పశువుల రవాణాపై ఉక్కుపాదం

- 41 మందిపై బైండోవర్ కేసులు
- ఎస్సై మేడా ప్రసాద్

**బూర్గంపహాడ్ మహా :** అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని, అక్రమంగా గోవులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బూర్గంపహాడ్ ఎస్ఐ మేడా ప్రసాద్ హెచ్చరించారు. మండల వ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణాతో పాటు అక్రమ గోవుల రవాణా కు పాల్పడుతున్న 41 మందిపై శనివారం బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.మండల కేంద్రంలోని రెండు అక్రమ ఇసుక ర్యాంపుల ద్వారా ఇసుక తరలిస్తున్న 8 మందిపై బైండోవర్ కేసు నమోదు చేశారు. మరికొంత మందిని సోమవారం బైండోవర్ చేయనున్నట్లు ఎస్సై వెల్లడించారు.అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే క్రిమినల్ కేసులతో పాటు బైండోవర్ చేస్తాం. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేవారిని ఉపేక్షించేది లేదు అని ఎస్సై మేడా ప్రసాద్ స్పష్టం చేశారు. అక్రమ రవాణా సమాచారం ఉంటే వెంటనే. పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన

## బూర్గంపాడ్‌లో కృషి విజ్ఞాన కేంద్రం సదస్సు



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం విత్తనోత్పత్తిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు పలు సలహాలు సూచనలు చేశారు.డిమాండ్ ఉన్న వరి రకాల మాత్రమే సాగు చేయాలి..మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాల ను మాత్రమే సాగు చేయాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా. టి. భరత్ అన్నారు. రైతులు మార్కెట్ లో డిమాండ్ ఉన్న వరి రకాలను, ముఖ్యంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన రకాలను ఎంచుకొని సాగు చేసుకోవాలని సూచించారు. కేవీకే సాంకేతిక సహకారంతో వరి, కందిలో విత్తన ఉత్పత్తి చేపడుతున్న వివరాలు రైతులకు తెలిపారు.

### భూసారం కాపాడుకోవాలి

ఆదిత్య ఎరువులు వద్దు పచ్చిరొట్ట ముద్దు అని బూర్గంపహాడ్ వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు బిక్కసాని శ్రీనివాసరావు అన్నారు .రైతులు పోటీతత్వంతో మోతాదుకు మించి ఎరువులు వాడటం వలన భూసారం తగ్గిపోతుందని తెలిపారు. జీలుగ, జనుము, పిల్లిపెసర, పెసర, మినుము వంటి పచ్చిరొట్ట పైర్లు సాగు చేసుకొని భూమిలో కలియదున్నాలని సూచించారు. దీనివల్ల భూసారం పెరుగుతుందని రైతులకు వివరించారు.

### పంట మార్పిడి అవసరం

పంట మార్పిడి అవసరమని ఉద్యాన శాస్త్రవేత్త శివ రైతులకు సూచించారు. రైతులు ఒకే రకమైన పంటలు పండించడం వలన గిట్టుబాటు కావడం లేదని, పంట మార్పిడి పాటించడం ద్వారా సుస్థిర ఆదాయంతో పాటు నేలతల్లి ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో , సభ్యులు, 25 మంది అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

# రూ.6.55 కోట్లతో నిర్మించనున్న చెక్ డ్యామ్

- నిర్మాణానికి స్థల పరిశీలన చేసిన రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు
- ఖమ్మం-సూర్యాపేట జిల్లాలో 330 ఎకరాలకు సాగు జలాలు
- రైతులను ఒప్పించేందుకు కౌన్సిలింగ్ నిర్వహించిన అధికారులు



**నేలకొండపల్లి, మహా:** మండలం లోని కట్టుకాచారం లో రూ.6.55 కోట్లతో నిర్మించనున్న చెక్ డ్యామ్ నిర్మాణానికి సంబంధించిన స్థలం ను రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు శనివారం స్థల పరిశీలన చేశారు. రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తో మండలం లోని కట్టుకాచారం లో పాలేరు ఏటి పై చెక్ డ్యామ్ ను నిర్మించేందుకు రూ.6.55 కోట్ల ను మంజూరు చేయించారు. ఈ మేరకు శనివారం చెక్ డ్యామ్ అవసరమైన స్థలం ను పరిశీలించారు. చెక్ డ్యామ్ కు అవసరమైన స్థలం ను ఎంపిక చేశారు. హద్దులు ఏర్పాటు చేశారు. ఈ చెక్ డ్యామ్ వలన ఖమ్మం జిల్లాలో కట్టుకాచారం సూర్యాపేట జిల్లాలోని కొత్తగూడెం గ్రామాలలో భూగర్భజలాలు పెంచటంతో పాటు 330 ఎకరాల ఆయకట్టుకు సాగు జలాలు అందనున్నాయి. కాగా ఓ రైతు చెక్ డ్యామ్ వలన తన పొలం కోత కు గురవుతుందని అభ్యంతరం చెప్పారు. ఈ మేరకు నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్, ఇరిగేషన్ డీఈఈ మన్మధరావు లు రైతు కు కౌన్సిలింగ్ నిర్వహించారు. సోమవారం నాటికి సమస్య ను పరిష్కరిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ ఆలస్యం మధుసూధన్రావు, ఇరిగేషన్ ఏఈ నరేష్, సర్వేయర్ మదనమోహన్, సర్పంచ్ బీ.సైదులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. చెక్ డ్యామ్ కు నిధులు మంజూరు చేయించిన మంత్రి శ్రీనివాసరెడ్డి కి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కొడాలి గోవిందరావు కృతజ్ఞతలు తెలిపారు.

# మణుగూరు ఏరియా..



- బీసీ లైజన్ అధికారిగా శ్రీనివాసచారి..
- సింగరేణి బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానం..

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి కాలరీ మణుగూరు ఏరియా బీసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో మణుగూరు ఏరియాకు బీసీ లైజన్ అధికారిగా నియమితులైన ఎస్ఓ టు జీఎం శ్రీనివాసచారిని శనివారం జీఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి మణుగూరు ఏరియాకు చెందిన బీసీ ఉద్యోగులు, నాయకులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సంఘం అధ్యక్షుడు సాయిల సురేష్, ప్రధాన కార్యదర్శి ఇందూరి శంకర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు శ్రీనివాసచారిని పూల బొకే దయచేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ లైజన్ అధికారి శ్రీనివాసచారి మాట్లాడుతూ.. మణుగూరు ఏరియాలోని బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని తెలిపారు. ఉద్యోగుల హక్కుల సాధనకు తనవంతు సహకారం అందిస్తూ, తనపై అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ బీసీ ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, అభ్యున్నతి కోసం సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఇళ్ల గణన తప్పులు దొర్లకుండా లెక్కించాలి



**నేలకొండపల్లి, మహా:** ఇండ్ల గణన కార్యక్రమం లో తప్పులు దొర్లకుండా క్షేత్ర స్థాయి లోఖచ్చితంగా లెక్కించాలని నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్ సూచించారు. మండలం లోని చెరువుమాధారం. రాయగూడెం, కట్టుకాచారం తదితర గ్రామాలలో శనివారం పర్యటించి సర్వే ను . పరిశీలించారు. ఎన్యూమరేటర్ల కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... మండలం లో మొత్తం 93 బ్లాక్ లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 91 మంది ఎన్యూమరేటర్స్, 16 మంది సూపర్వైజర్స్ లను నియమించినట్లు తెలిపారు. సర్వే ఖచ్చితంగా ఉండాలని సూచించారు. సోమవారం నుంచి జూన్ 9 వరకు సర్వే జరుగుతుందని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. సకాలంలో సర్వే ను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఏఎస్ వో స్పందన. మండల రెవిన్యూ ఇన్స్‌పెక్టర్స్ ఆలస్యం మధుసూధన్రావు, పంచాయతీ కార్యదర్శి లు, ఎన్యూమరేటర్స్, సూపర్వైజర్స్ తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసిన వినోద్



**నేలకొండపల్లి, మహా:** జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్ష పదవీ కి పోటీ తీవ్రంగా ఉంది. రాష్ట్ర నాయకులు, పరిశీలకులు శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం లో ఎస్సీ సెల్ అధ్యక్షుడు పదవి కి దరఖాస్తులు స్వీకరించారు. నేలకొండపల్లి మేజర్ పంచాయతీ 13 వ వార్డు సభ్యులు, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రధాన అనుచరుడు కోడిరెక్క వినోద్ దరఖాస్తు చేసుకున్నారు. వినోద్ కు మద్దతు గా నేలకొండపల్లి మేజర్ పంచాయతీ వార్డు సభ్యులు పరిశీలకులను కలిసి వినోద్ కు ఇవ్వాలని కోరారు. పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనటమే కాకుండా..సామాజి సేవా కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. యువత కు అవకాశం కల్పించాలని మద్దతుదారులు పరిశీలకులను కోరారు. ఈ సందర్భంగా . కోడిరెక్క వినోద్ మాట్లాడారు.. పార్టీ కోసం సైనికుల్లా పని చేస్తానని పేర్కొన్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి ఆదేశాలను పాటించటమే తన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సామాల కోటేశ్వరరావు, కాసాని సంధీఫ్, మన్నె నరేష్, కె. నాగేశ్వరరావు, వి.పవన్ తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన ఇంధన ధరలు వెంటనే తగ్గించాలని

# సీపీఐ ఆధ్వర్యంలో నిరసన.. ధర్నా




**మణుగూరు, మహా :** పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శనివారం మణుగూరులో సీపీఐ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయం ఎదుట ఎర్రజెండాలతో నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు ఇంధన ధరలు పెంచకుండా ఉండి, ఎన్నికలు ముగిసిన వెంటనే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపుతోందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ సామాన్య ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తోందన్నారు. ప్రశ్నించే వారిపై ఈడీ, సీబీఐ వంటి సంస్థలతో ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకొని ధరలను తగ్గించాలని, లేకపోతే ప్రజాగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరు వెంకటేశ్వర రావు, రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, నరాటి ప్రసాద్, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, జిల్లా సమితి సభ్యులు మోహన్‌రావు, పట్టణ కార్యదర్శి దుర్గ, మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, జిల్లా సమితి సభ్యులు వై రామ్‌గోపాల్, ఎడారి రమేష్, సోందే కుటుంబరావు, సీనియర్ నాయకులు గద్దం మనోహరాచారి, తోగటి కుమార్, ఎస్‌కే సర్వర్, తోట రమేష్, కామిశెట్టి రామారావు, గద్దం వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సీతారాములు, వేల్పుల నరేష్, ఎస్‌వీ నాయుడు, పులిగల రమేష్, బాడిస సతీష్, నోముల రవి, వజ్జా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# గౌతమిపురంలో డ్రైనేజీ సమస్యల పరిశీలన

## త్వరలో పనులు చేపడతామని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధులు



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని 11వ వార్డు గౌతమిపురంలో పేరుకుపోయిన డ్రైనేజీ సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు పరిశీలించారు.ఈ సందర్భంగా బూర్గంపహాడ్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ గుండె వెంకన్న , 11వ వార్డు మెంబర్ భజన నాగం కలిసి కాలువలను పరిశీలించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు వివరించారు. దీనిపై స్పందించిన ప్రజాప్రతినిధులు తక్షణమే డ్రైనేజీ శుభ్రపరిచే పనులు మరియు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

# లక్ష్మీపురంలో లారీ మెకానిక్ హత్య కేసు ఛేదించిన పోలీసులు

**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్య కేసును పోలీసులు ఛేదించారు. లక్ష్మీపురం గ్రామంలో ఐటీసీ లారీ యార్డు సమీపంలో జరిగిన హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి శుక్రవారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 144/2026, సెక్షన్ 103(1) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన కుందన్ సింగ్ అలియాస్ అర్జున్ (40) లారీ మెకానిక్‌గా పనిచేస్తూ లక్ష్మీపురం గ్రామంలో నివసిస్తున్నాడు. అతనితో పాటు చత్తీస్‌గఢ్‌కు చెందిన డానియల్ నాగ్, విజయవాడకు చెందిన లక్ష్మణ్ కూడా అదే ప్రాంతంలో పనిచేస్తూ అక్కడే ఉంటున్నారు.అదే ప్రాంతంలో కరీంనగర్ జిల్లా భగత్‌నగర్‌కు చెందిన మోర్ శ్రావణ్ (32) కూడా లారీ మెకానిక్‌గా పని చేస్తూ నివసిస్తున్నాడు.తేదీ 10 052026 రాత్రి సమయంలో మృతుడు కుందన్ సింగ్ మరియు నిందితుడు శ్రావణ్ మధ్య మద్యం మత్తులో గొడవ జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఆ గొడవను మనసులో పెట్టుకున్న శ్రావణ్, కుందన్ సింగ్‌ను హత్య చేయాలని నిర్ణయించుకుని, 11052026 తెల్లవారుజామున సుమారు 3:30 గంటల సమయంలో అక్కడే ఉన్న బండరాయితో కుందన్ సింగ్ తలపై బలంగా దాడి చేసి హత్య చేసినట్లు వెల్లడించారు. ఫిర్యాదుదారుగా రాయల వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు

## సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి పొంగిలేటి సమీక్ష..

- ప్రతి ఎకరాకు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యం...
- పులుసుబొంత, రేగులగండి, మారెళ్లపాడు పనులు వేగవంతం చేయాలని ఆదేశం..



**మణుగూరు, మహా :** పినపాక నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, పెండింగ్ పనులు, నిధుల మంజూరు అంశాలపై రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస రెడ్డి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించినట్లు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం జరిగిన సమావేశంలో నియోజకవర్గంలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిపై సుదీర్ఘంగా చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మంత్రి పొంగిలేటి ప్రత్యేక చొరవతో పినపాక నియోజకవర్గాన్ని సాగునీటి రంగంలో అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

### పులుసుబొంత ప్రాజెక్టుకు నిధుల మంజూరుపై ఆదేశాలు..

కరకగూడెం మండల పరిధిలో ప్రతిపాదిత పులుసుబొంత ప్రాజెక్టు ద్వారా సుమారు 4,500 ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ప్రాజెక్టుకు అవసరమైన నిధులను త్వరితగతిన మంజూరు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఫారెస్ట్ క్లియరెన్స్‌కు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించి పనులు వేగవంతం చేయాలని సూచించారు.

### రేగులగండి ప్రాజెక్టు పనులు వేగంగా..

మణుగూరు మండలంలోని రేగులగండి ప్రాజెక్టు ద్వారా సుమారు 2 వేల ఎకరాలకు సాగునీరు అందనుందని, ప్రస్తుతం పనులు సజావుగా కొనసాగుతున్నాయని అధికారులు వివరించారన్నారు. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అవసరమైన అదనపు నిధులను వెంటనే విడుదల చేయాలని మంత్రి ఆదేశించారు.

### మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చివరి దశలో..

అశ్వాపురం మండలంలోని మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ద్వారా 16 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా రూ.25 కోట్ల అంచనా వ్యయంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ నెలాఖరు లేదా వచ్చే జూన్ నాటికి పనులు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. పనులు పూర్తయిన వెంటనే రైట్ కెనాల్‌కు నీటి విడుదల సాధ్యమవుతుందని పేర్కొన్నారు. లెఫ్ట్ కెనాల్ పనులకు సంబంధించి అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారన్నారు.

### దోమలవాగు చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి..

బూర్గంపాడు మండలంలోని దోమలవాగు చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసి 14 వేల ఎకరాలకు సాగునీటి వసతి కల్పించే ప్రణాళికపై సమావేశంలో చర్చించారమన్నారు. ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేసి త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి సూచించారన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ములుగు జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారని తెలిపారు.

### పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి..

నియోజకవర్గ పరిధిలోని ఎత్తిపోతల పథకాలు, సాగునీటి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, తాగునీటి పథకాల భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో విస్తృతంగా చర్చించారమని పేర్కొన్నారు. రైతులకు తక్షణ ప్రయోజనం చేకూరేలా పెండింగ్ పనులను వేగవంతం చేయాలని, అవసరమైన నిధుల మంజూరు, సాంకేతిక, పరిపాలనా అనుమతులను త్వరగా పూర్తి చేయాలని మంత్రి పొంగిలేటి శ్రీనివాస రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారన్నారు.

## పర్యావరణాన్ని కాపాడుకోవడమే ప్రధాన కర్తవ్యం

### ప్రపంచ పర్యావరణ సంస్థ సభ్యుల పిలుపు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** పర్యావరణాన్ని పరిరక్షించడం అంటే కేవలం ప్రకృతిని కాపాడటం మాత్రమే కాదని మన దేహాన్ని దేశాన్ని భవిష్యత్ తరాలను రక్షించుకోవడమే అని ప్రపంచ పర్యావరణ సంస్థ సభ్యులు పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలోని ఎస్సార్ నగర్‌లో ఉన్న ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ కార్యాలయంలో సంస్థ ప్రధాన కార్యదర్శి నిఖిల్ సాయి కోనేటి అధ్యక్షతన శనివారం జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ భద్ర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సిహెచ్ భద్ర మాట్లాడుతూ గల్లి నుండి ఢిల్లీ వరకు ప్రపంచ పర్యావరణ సంస్థ గత 15 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ప్రజా చైతన్య కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం స్పందించడం శుభ పరిణామమని ఈ సందర్భంగా సంస్థ జాతీయ కార్యవర్గాన్ని అభినందిస్తున్నట్లుగా పేర్కొన్నారు. ప్రతి ఇంట్లో, ప్రతి ఒంట్లో ఉన్న ప్లాస్టిక్ వల్ల పెరుగుతున్న కాలుష్యంపై యుద్ధం చేయాలని సంస్థ నిరంతరం పిలుపునిస్తూ వస్తోందని పేర్కొన్నారు. ఈ మహా ఉద్యమానికి స్పందించిన భారత ప్రధానమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. దేశ అభివృద్ధి, ఆర్థిక పురోగతి, స్వచ్ఛ భారత్ నిర్మాణం కోసం భారత ప్రభుత్వం చేపడుతు




న్న పది రకాల చర్యలు శుభపరిణామమని అన్నారు. ప్రజలందరూ గత 15 సంవత్సరాలుగా ప్రపంచ పర్యావరణ సంస్థ చేస్తున్న ప్రజా చైతన్య కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకుని స్వచ్ఛ భారత్ - స్వస్థ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సంస్థ సలహాదారులు విశ్వ గురు గల్లా ప్రకాష్ మాస్టర్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ సంస్థ చేస్తున్న పోరాటానికి నేడు పాలకులు స్పందించడం ఆనందకరమన్నారు. ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని కాలుష్యం కారణంగా భవిష్యత్‌లో ప్రతి మనిషి అనారోగ్య సమస్యలను ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మంచి ప్రకృతి మంచి ఆరోగ్యం భవిష్యత్ తరాలకు అందించడమే నిజమైన సంపద అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులకు సంపూర్ణ ఆరోగ్యం, ఆసుపత్రులు మందులకు దూరంగా 100 సంవత్సరాలు ఆరోగ్యవంతంగా జీవించే విధానంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాబోయే రోజుల్లో పర్యావరణ పరిరక్షణ కోసం మహా ఉద్యమం-మహా చైతన్య కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజలను, ప్రభుత్వాలను అనుసంధానం చేస్తూ స్వచ్ఛ భారత్-స్వస్థ భారత్ నిర్మాణం కోసం అందరం కలిసి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పర్యావరణ పరిరక్షణ పది సూత్రాలను పాటిద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ కార్యదర్శి సాగర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీధర్, సీనియర్ ఉపాధ్యక్షుడు పవన్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి క్రాంతి నాయుడు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సాగర్ పటేల్, శ్రీనివాస్ పటేల్, జనగామ జిల్లా అధ్యక్షుడు యువరాజ్, ములుగు జిల్లా అధ్యక్షుడు బొల్లు నాగేంద్ర కుమార్, హెల్త్ విభాగం కార్యదర్శి డాక్టర్ నరేష్, పాల్వంచ పట్టణ అధ్యక్షురాలు శ్వేతా నాయుడు, మణుగూరు పట్టణ అధ్యక్షుడు సైదా నాయుడు, కార్యవర్గ సభ్యులు రోహిత్ రెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజా, వివిధ జిల్లాల నుంచి వచ్చిన వాలంటీర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



## ఇంధన ధరల పెంపుపై మాస్ లైన్ నిరసన

**కారేపల్లి, మహా :** పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో శనివారం కారేపల్లి మండలం పోలంపల్లిలో కేంద్రప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మాస్ లైన్ ఖమ్మం డివిజన్ నాయకులు గుగులోతు తేజ నాయక్ మాట్లాడుతూ ఎన్నికల అనంతరం పెట్రోలియం ధరలు పెంచటం దేశ ప్రజలను మోసం చేయటమేనన్నారు. ఇంధన ధరల పెంచటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై ప్రత్యక్షంగా పరోక్షంగా తీవ్ర ఆర్థిక భారం పడుతుందని నిత్యావసర వస్తువులు, కూరగాయలు, బస్ ఛార్జీలు, ఆటో సేవల ధరలు పెరగనున్నాయన్నారు. బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజల కంటే కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యత ఇస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన ఇంధన ధరల తగ్గించాలని లేదంటే ప్రజల అగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ నాయకులు పులకాని సత్తిరెడ్డి, రావుల నాగేశ్వరావు, ధరావత్ సక్రు నాయక్, గుగులోతు రాము, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మ రక్షణకు కరాటే

### కరాటే శిక్షణ ప్రారంభించిన సర్పంచ్ వీరప్రతాఫ్



**కారేపల్లి, మహా :** సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాఫ్(టోనీ) ఆధ్వర్యంలో కారేపల్లిలో శనివారం చిన్నారులకు కరాటే శిక్షణ ను ప్రారంభమైనాయి. శిక్షణను సర్పంచ్ మేదరి వీరప్రతాఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పిల్లలు,యువతలో ఆత్మరక్షణ, క్రమశిక్షణ, శారీరక దృఢత్వాన్ని పెంపొందించేందుకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకొని గ్రామానికి చెందిన బాలబాలికలు, యువతకు ఈ శిక్షణ ప్రారంభించటం జరిగిందన్నారు. కరాటేతో పిల్లలలో ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయన్నారు. శిక్షణ అనంతరం పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి, వార్డు సభ్యులు రావుల రాజశేఖర్, సరోజ, మేకల కుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.




## నర్సా బాయ్ కుంటను ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేస్తాం

### దేవాలయం వెనుక వైపు రిటర్నింగ్ వాల్ నిర్మించాలని జోనల్ కమిషనర్ కు కాలనీ వాసులవినతులు

**రాజేంద్రనగర్, మహా ;** మైలార్దేవపల్లి డివిజన్ పరిధిలోని మార్కండేయ నగర్ బాబుల్ రెడ్డి నగర్ బస్తీల మధ్య ఉన్న నర్సాబాయి కుంట అభివృద్ధి విషయంలో స్వయంగా పర్యటించి చర్యలు తీసుకోనున్నట్లు జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సైతం నర్సా బాయ్ కుంట అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని, అందుకు కావలసిన నిధులు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయిస్తానని ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో సూచించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. శనివారం మార్కండేయ నగర్ సత్యసాయి పొదుపు సంఘం అధ్యక్షులు పి సూర్యనారాయణ ఆధ్వర్యంలోబస్తీ వాసులతో కలిసి జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి నర్సా బాయ్ కుంటకు రిటర్నింగ్ వాల్ నిర్మించాలని కోరుతూ శనివారం వినతిపత్రం అందజేశారు. కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ నర్సా బాయ్ కుంట రిటర్నింగ్ వాల్ తోపాటు పార్కు అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు.ఒకటి రెండు రోజుల్లో తానే స్వయంగా వివిధ విభాగాల అధికారులతో కలిసి నర్సాబాయ్ కుంట ప్రాంతంలో పర్యటించి ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయడానికి కావలసిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, గద్దె యాదగిరి, ప్రధాన కార్యదర్శి కోట శ్యాం కుమార్, ఉపాధ్యక్షుడు మునగపాటి విష్ణు, సంయుక్త కార్యదర్శి కర్నాటి శ్రీనివాస్, కోశాధికారి కోట పవన్ కుమార్ , గంజి నరేష్, భూసం బానుచందర్, తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ డీజిల్ ధరల పెంపుకు సిపిఐ నాయకుల ధర్నా నిరసనలు

**రాజేంద్రనగర్, మహా ;** ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం అయింది. కార్పొరేట్ దోపిడి దారులకు ధరలను పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మండిపడ్డారు. శంషాబాద్ లోని బెంగళూరు జాతీయ రహదారిపై సిపిఐ నాయకులు శనివారం ధర్నా నిరసనలు నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ దోపిడి వర్గాలకు కొమ్ముకాస్తూ సామాన్య ప్రజలను గాలికి వదిలేసిందన్నారు. దాని ఫలితంగానే వంట గ్యాస్ పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నాయని వాపోయారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నరేంద్ర మోదీ ప్రజలకు చాలా హామీలు ఇచ్చారు. ఏ ఒక్క హామీ అమలు చేయలేదని పర్వతాలు మండిపడ్డారు. అమెరికా, ఇజ్రాయిల్,




ఇరాన్ పైన చేస్తున్న యుద్ధం వల్ల పెట్రోల్ డీజిల్ వంటగ్యాస ధరలు పెరుగుతున్నాయని దీనిని అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు టి రామకృష్ణ , సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్ యాదగిరి, మండల కార్యదర్శి కే చందు యాదవ్. నాయకులు ప్రవీణ్ కుమార్ గౌడ్, శ్రీనివాస్, నారాయణ, రఘు, మధు , శ్రీను అనిత తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రమాదంపై స్పందించిన కౌన్సిలర్ బేగం బీ

- ఆలస్యంగా తమ దృష్టికి రావడంతో విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించిన కౌన్సిలర్
- చిన్నారులను పరామర్శించి ఆర్థిక సాయం అందచేసిన కౌన్సిలర్ బేగం బీ



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డులో ముస్లిం శ్మశానవాటిక రోడ్డు పక్కన గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ దిమ్మె ఎత్తు తక్కువగా ఉండడంతో మరొక ఎత్తైన దిమ్మె ఏర్పాటు చేసేందుకు తాత్కాలికంగా ట్రాన్స్ఫార్మర్ ను ఇనుప స్టాండు పై ఉంచడంతో జరిగిన ఘటన లో ఇద్దరు చిన్నారుల గాయపడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో స్పందించిన 2వ వార్డు కౌన్సిలర్ బేగం బీ ఘటన జరిగి వారం గడిచిన ఆలస్యంగా తమ దృష్టికి రావడంతో తక్షణమే జరిగిన సంఘటన కోసం స్థానికులను అడిగి తెలుసుకొని విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరగా స్పందించిన అధికారులు వెంటనే తాత్కాలిక ఇనుప స్టాండు పై ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ ను ఎత్తుగా ఏర్పాటు చేసిన దిమ్మె పై పెట్టడం జరిగింది గాయపడిన చిన్నారులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని ఆర్థిక సహాయం అందచేశారు. ఇలాంటి సంఘటన వేరే ఎక్కడ జరగకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. జరిగిన సంఘటనను దృష్టిలో పెట్టుకొని బాధితులకు ఆర్థిక సహాయం చేయాలని విద్యుత్ అధికారులను కోరగా వారు పై అధికారులతో మాట్లాడి బాధితులకు సహాయం అందేలా చూస్తామని తెలిపారు

**కౌన్సిలర్ బేగం బీ మాట్లాడుతూ**

2వ వార్డులో ఉన్న అన్ని సమస్యలు దశల వారీగా తీరుస్తానని ఇలాంటి సంఘటన 2వ వార్డులో మరొకటి జరగకుండా విద్యుత్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2వ వార్డులో ఉన్న ట్రాన్స్ఫార్మర్లు అన్ని ఎత్తైన దిమ్మె పై ఏర్పాటు చేసి ట్రాన్స్ఫార్మర్ చుటూ కంచే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు అప్పటి వరకు తల్లితండ్రులు తమ పిల్లల పై దృష్టి పెట్టాలని కోరారు.



## బిజెపి ప్రభుత్వం ప్రజలపై భారాలు

### కాంగ్రెస్ నేత చంద్రప్రకాశ్

కారేపల్లి, మహా : బీజేపీ పాలన ప్రజలపై భారాలు, ప్రజల మధ్య విద్వేషాలు పెంచటం తప్ప దేశానికి చేసింది శూన్యమని సింగరేణి మండల కాంగ్రెస్ మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాశ్ విమర్శించారు. శనివారం కారేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ తప్పు నిర్ణయాలతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలను వాయిదాల పద్దతిలో పెంచటానికి మోడీ ప్రభుత్వం పూనుకుందన్నారు. ఇప్పటికే రూ.3.50 భారం వేసిన మోడీ రానున్న రోజుల్లో మరింత పెంచటానికి సిద్ధమవుతోందన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియటంతోనే ప్రజల నుంచి వసూళ్లు దందా ప్రారంభించిందని ఆరోపించారు. సామాన్య ప్రజలకు భారంగా మారే నిర్ణయాలు తీసుకుంటే కాంగ్రెస్ చూఎస్త్రdశ్రీ ఊరుకోదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దారావత్ భద్రునాయక్, గద్దం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వ్యర్థాలు తిని...ఓ ఆవు మృతిక మరో ఆవు పరిస్థితి విషమం

**నేలకొండపల్లి, మహా:** పంక్షన్ల వద్ద మిగిలిన ఆహార పదార్థాలు.. ప్లాస్టిక్ కవర్స్ లాంటి వ్యర్థాలు తిని రెండు ఆవులలో ఒకటి మృతి చెందగా..మరో ఆవు పరిస్థితి విషమంగా ఉంది.. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలంలోని మంగాపురంతండాకు చెందిన బోడ జగ్గయ్య అనే రైతు కు చెందిన రెండు ఆవులు శనివారం గ్రామ శివారు లో వేసిన వ్యర్థాలను తిని అసవస్థత కు గురైయ్యాయి. రూ.50 వేల విలువైన ఆవు చనిపోయింది. కాగా మరో ఆవు పరిస్థితి విషమంగా మారింది. పశు మిత్ర లు వైద్య సేవలు అందిస్తున్నారు. చనిపోయిన ఆవు వద్ద లేగదూడలు ఆరుస్తున్న తీరు పలువురు ను కంటతడి పెట్టిస్తుంది. వ్యర్థాలు తిని గతం లో కూడ ఆవు మృతి చెందింది. రహదారుల వెంట వ్యర్థాలు వేయవద్దని.. డంపింగ్ యార్డ్ వద్ద వేయాలని పంచాయతీ సర్పంచ్ ధీరావత్ అశోకా రాణి కోరారు. మూగజీవాలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రజలు సహకరించాలని కోరారు.

## మణుగూరు మనుగడకు చర్యలు తీసుకోండి..

### సింగరేణి సీఎండీకి ఐఎఫ్‌టియు వినతి..

**మణుగూరు, మహా :** మణుగూరు ఏరియా మనుగడను కాపాడుతూ సింగరేణి పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఐఎఫ్‌టియు నాయకులు సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి ఐఏఎస్, జీఎం కోఆర్డినేషన్ టి శ్రీనివాస్‌లకు ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (జీఎల్‌బీకేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు యస్ డి నాసర్ పాషా ఓ ప్రకటనలో తెలిపారు. సింగరేణికే తలమానికంగా ఉన్న మణుగూరు ప్రాంతం ప్రస్తుతం సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటోందన్నారు. మణుగూరు మనుగడను కాపాడాలంటే పీకే ఓసీ డిప్ సైడ్ గనిని సింగరేణికే కేటాయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో ఉత్పత్తి, ఉత్పాదకత పెంపు కోసం అంతర్జాతీయ ప్రమాణాల భారీ యంత్రాలను కొనుగోలు చేయాలని, అవసరమైన విడిభాగాలు అందుబాటులో ఉంచాలని, నిర్వహణ సామర్థ్యాన్ని మెరుగుపరచాలని కోరారు. ఇటీవల చోటుచేసుకుంటున్న భారీ యంత్రాల అగ్నిప్రమాదాల నేపథ్యంలో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని విజ్ఞప్తి చేశారు. 2025 డిసెంబర్ నాటికి



190 మస్టర్లు పూర్తి చేసుకున్న జనరల్ అసిస్టెంట్ ట్రైనీలను క్రమబద్ధీకరించాలని, భూపాలపల్లి కేటీకే ఓసీ3 భూగర్భ గని మూడో సీమ్‌కు మ్యాన్ రైడింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రస్తుతం కార్మికులు సుమారు మూడు కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని, దీనివల్ల శ్రమతో పాటు గైర్హాజరు శాతం కూడా పెరుగుతోందన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని, గైర్హాజరు పేరుతో విధిస్తున్న పెనాల్టీ నిబంధనను రద్దు చేయాలని, టీ, టిఫిన్, భోజనాల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈఎస్ఐ వైద్య సౌకర్యం అమలు చేయాలని, నర్సరీ కాంట్రాక్ట్ కార్మికులకు సెంట్రల్ జీవో, సీఎంపీఎఫ్ వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ హుమాయూన్ తదితరులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

## జాతీయ కీటకజనిత వ్యాదులపై ప్రజలకు అవగాహన ర్యాలీ

- డీఎంహెచ్వో లక్ష్మి ప్రసన్న ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహణ

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** తెలంగాణ ప్రభుత్వం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖరంగారెడ్డి, పోస్ట్ పాత్రూం యూనిట్ ప్రాంత ప్రజలకు, ప్రభుత్వం దోమల ద్వారా వచ్చే వ్యాధులపై, ప్రభుత్వ అధికారులు మెరుగైన అవగాహనా కొరకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ఆరోగ్య కార్యక్రమములో బాగంగా శనివారం జాతీయ కీటకజనిత వ్యాదులపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ లక్ష్మీ ప్రసన్న జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. (NCVBDCP) దోమల నుండి వచ్చే మలేరియా, డెంగ్యూ, చికన్ గున్యా, మెదడువాపు, బోదకాల వంటి మొదలగు వ్యాధులు ప్రభలకుండా ప్రతి ఒక్కరు ఇంటిలో ఇంటి చుట్టు ఎక్కువ రోజులు నీటి నిలువ లేకుండ చూసుకోవాలి, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి అని NCVBDCP పై ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహనా కల్పించడం జరిగిందని డాక్టర్ లక్ష్మీప్రసన్న అన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం డివిజన్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి రామయ్య, ప్యార మెడికల్ ఆఫీసర్ మసూద్ అలి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ హెమ్ లాల్, ఆరోగ్య బోధకురాలు బ్రిజితమ్మ, సూపర్ వైజర్ వైయోల, మహిళ ఆరోగ్య కార్యకర్త మేరీ, ల్యాబ్ టెక్నిసియన్ వేణు, ఐసిటిసి కౌన్సిలర్ అనిల్, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్త, ప్రజలు పాల్గొని NCVBDC డెంగ్యూ మలేరియా ర్యాలి కార్యక్రమమును విజయవంతం చేయడం జరిగింది.

## గంజాయి సేవిస్తూ పట్టుబడిన నలుగురు యువకులు

### రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించిన భద్రాచలం పోలీసులు

**భద్రాచలం మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం టౌన్ పోలీస్ పరిధిలో గంజాయి సేవిస్తున్న నలుగురు యువకులను గుర్తించి వారిని పునరావాస కేంద్రానికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు భద్రాచలం పట్టణంలో గంజాయి అక్రమ రవాణా, సరఫరా మరియు వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు భద్రాచలం ఇన్‌స్పెక్టర్ నాగరాజు వెల్లడించారు. ఈ క్రమంలో శనివారం భద్రాచలం పట్టణంలో గంజాయి టెస్టింగ్ కిట్ల ద్వారా ప్రత్యేక తనిఖీలు నిర్వహించగా నలుగురు యువకులకు గంజాయి వినియోగం పాజిటివ్‌గా తేలిందన్నారు. అనంతరం వారికి కౌన్సిలింగ్ నిర్వహించి, భద్రాచలం పట్టణంలోని దక్షిత సొసైటీ డిస్ట్రిక్ట్ అడిక్షన్ రిహాబిలిటేషన్ సెంటర్ కు తరలించినట్లు తెలిపారు. ఇకపై భద్రాచలం పట్టణంలో మత్తు పదార్థాలు సేవించే వారిపై విస్తృతంగా తనిఖీలు కొనసాగిస్తామని పోలీసులు హెచ్చరించారు. గంజాయి రవాణా చేస్తున్నా, విక్ర




యిస్తున్నా లేదా సేవిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. మత్తు పదార్థాలకు బానిసలై యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన, స్నేహితుల వర్గం, కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని పోలీసులు సూచించారు.

### శంషాబాద్ ఎయిర్పోర్ట్ కు ల్యాండ్ అయ్యేలోపు ఏ క్షణంలోనైనా

## ఫెయిల్ చేస్తామంటూ బాంబు బెదిరింపు మెయిల్స్

**రాజేంద్రనగర్, మహా ;** మలేషియా నుండి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు వస్తున్న ఎయిర్ ఏషియా విమానానికి శనివారంబాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకునే లోపు ఏ క్షణమైన పేల్చేస్తామని బెదిరింపు మెయిల్ చేసిన గుర్తుతెలియని ఆగాంతకుడు. అప్రమత్తమైన ఎయిర్ పోర్ట్ సెక్యూరిటీ సిబ్బంది ప్రయాణికులను దింపేసి విమానాన్ని పూర్తిగా తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి బాంబు లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న ఎయిర్పోర్ట్ అధికారులు. ఐసిలేషన్ లో విమానం. బాంబు బెదిరింపు మెయిల్స్ కాల్స్ పరిపాటిగా మారాయిని అధికారులు వాపోయారు.




## డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి..

### మణుగూరులో జాతీయ డెంగ్యూ దినోత్సవ కార్యక్రమం

**మణుగూరు, మహా :** జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా డెంగ్యూ నివారణపై ప్రజలకు ప్రతిజ్ఞ చేయించడంతో పాటు అవగాహన నినాదాలు చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ సునీల్ మాట్లాడుతూ డెంగ్యూ నివారణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. ఇంటి పరిసరాల్లో ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. నీటి తొట్లు, డ్రమ్స్, కూలర్లు తదితర నీటి నిల్వ పాత్రలను వారానికి ఒకసారి తప్పనిసరిగా శుభ్రం చేయాలని తెలిపారు. నిల్వ నీటిలో దోమలు విస్తరించి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని వివరించారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని పాటిస్తూ ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రతను కాపాడుకోవాలని ప్రజలకు సూచించారు. దోమల నివారణ చర్యలు క్రమం తప్పకుండా చేపడితే డెంగ్యూ వ్యాధిని సమర్థంగా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో వీరస్వామి సబ్ యూనిట్ ఆఫీసర్, డి పరంగిణి హెల్త్ ఎడ్యుకేటర్, సత్యమ్మ పీహెచ్ఎన్, సూపర్వైజర్ జానకి, స్వరూప రాణి, అనసూయ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మహా పత్రిక
ANN తెలుగు
ఆదివారం, హైదరాబాద్ | 17-05-2026 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM


# ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి

## ఐకేపి సెంటర్ ను సందర్శించిన ఆర్ ఎల్ డి అధ్యక్షులు దిలీప్ కుమార్



**యాదాద్రి భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం బొమ్మాయి పల్లి ధాన్యం కొనుగోలు ఐకేపి సెంటర్ ను శనివారం తెలంగాణ రాష్ట్ర రాష్ట్రీయ లోక్ దళ్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ , రాష్ట్ర యువజన అధ్యక్షులు రాజ్‌కుమార్ రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు గౌర బీరప్ప , రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు విక్రమ్ శర్మ , ప్రధాన కార్యదర్శి నరసింహారావు టీ ఆర్ఎల్డీ కార్యకర్తలు పరిశీలించారుఈ సందర్భంగా రైతులతో వారు మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రంలో భారీగా ధాన్యం నిల్వ ఉన్నప్పటికీ ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం, గన్నీ బ్యాగులు అందుబాటులో లేకపోవడం, నాణ్యత పేరుతో తూకంలో కోతలు విధించడం, తేమ శాతం పేరుతో ఇబ్బందులు పెట్టడం, అలాగే రైస్ మిల్లర్లు తమ వాటా కోరడం వంటి సమస్యలను వ్యక్తం చేశారు.దిలీప్ కుమార్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మార్కెటింగ్, వ్యవసాయ మరియు పౌర సరఫరాల శాఖల మధ్య సమన్వయం లోపించిందని తెలిపారు. ఇప్పటికే కేరళలో మాన్సూన్ ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన రైతులకు సహాయం చేసి, యార్డులకు వచ్చే ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

# ఉద్యమకారులను గుర్తించడానికి కాల పరిమితిపై స్పష్టమైన ప్రకటనలు చేయాలి

## సంగిశెట్టి క్రిస్టఫర్, మలిదశ ఉద్యమకారుడు

**వలిగొండ, మహా :** రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడానికి కేకే నాయకత్వంలో కమిటీ వేయడం కాల పరిమితి లేకుండా కాలయాపన కోసమేనని వెంటనే కేకే కమిటీని రద్దు చేసి జుడిషియల్ కమిషన్ వేయాలని టి యు జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ డిమాండ్ చేశారు గతంలో ప్రభుత్వం ప్రకటించినట్లుగా ఏ బి సి కేటగిరీలను ఏకకాలంలో గుర్తించాలని ఇప్పటికే ఉద్యమకారులు అనేకమంది చనిపోయారని మరి కొంతమంది ఆర్థికంగా నష్టపోయి రోడ్డున అడ్డా కూలీలుగా బతుకుతున్నారని రెండు నెలలకు మించి కాల పరిమితి పెంచకూడదని ఆయన అన్నారు.

# విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదివి జీవితంలో ఎదగాలి

## టీచర్ ఎమ్మెల్సీ పింగళి శ్రీ పాల్ రెడ్డి




**యాదాద్రి భువనగిరి, మహా:** విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకుంటూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని టీచర్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు.శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్య విజయోత్సవం 202526 విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి టీచర్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ముందుగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. విద్యార్థులకు పదవ తరగతి అనేది జీవితంలో ఎదిగేందుకు మొదటి మెట్టు అయినందున ఇంతటితో విద్యార్థులు తమ కష్టాన్ని ఆపకుండా ఇంకా కష్టపడి జీవితంలో చదివితే భవిష్యత్తులో ఒక గౌరవప్రదం పొందే అవకాశం విద్యార్థులకు కలుగుతుందన్నారు. విద్యార్థులు మరింత మెరుగుపడే విధంగా కష్టపడి చదివి తల్లిదండ్రులకు సమాజానికి మంచి పేరు తేవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై సమాజంలో వ్యతిరేకంగా ఉద్భోధన కు ప్రభుత్వ విద్యార్థులు కనబరిచిన ఉత్తీర్ణత ఫలితాలు ఒక నిదర్శనం అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి మంచి విద్య అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. జిల్లాలో ప్రైవేట్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అద్భుతమైన ఉత్తీర్ణత ఫలితాలు రికార్డు స్థాయిలో జిల్లా, మండల స్థాయిలో సాధించినందుకు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలలు అధికంగా జిల్లాలో 98.30% శాతం ఉత్తీర్ణత సాధించిందన్నారు. ప్రైవేట్ పాఠశాలలో 500 పై బడినవారు తక్కువ సంఖ్యలో ఉన్నారని అదే ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థుల సంఖ్య ప్రైవేటు పాఠశాలలు కంటే ఎక్కువ మంది విద్యార్థులు అధికంగా సాధించారన్నారు. ప్రభుత్వం రానున్న రోజుల్లో విద్యారంగం మార్పు కొరకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టనుందన్నారు. ప్రభుత్వం విద్యపై పెద్దపీట వేసి విద్యారంగంలో మార్పు తేవడానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, నియోజకవర్గస్థాయిలో పబ్లిక్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పన తదితర వాటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గతంలో పోలిస్తే ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు , రెసిడెన్షియల్ హాస్టల్స్ ఎక్కువ సంఖ్యలో పేద విద్యార్థులు చదువుకునేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో ప్రీ ప్రైమరీ, ఇంగ్లీష్ మీడియం వంటి సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలలో కల్పించబోతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఒక లీడర్ షిప్ గా తీసుకొని ముందుకు పోతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివించే తల్లిదండ్రులు మండలాలలో ఇతర తల్లిదండ్రులకు ఒక నిదర్శనమని వారు విద్యార్థి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు ఇంతటితో సంతృప్తి చెందకుండా జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ.... విజయోత్సవ కార్యక్రమానికి ముఖ్య కారణమైన విద్యార్థులకు ముందుగా అదనపు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ ఫలితాలు కనబరిచిన విద్యార్థులకు ప్రభుత్వం క్యాష్ అవార్డ్స్, విద్యార్థి ,తల్లిదండ్రులకు సన్మానం చేయాలని ఆదేశించనైనదన్నారు.

మన జిల్లాలో జిల్లా స్థాయిలో కనబరిచిన విద్యార్థులే కాకుండా మండల స్థాయి 1,2,3 వ స్థాయి టాపర్ల విద్యార్థులను కూడా ఎంపిక చేసి వారిని వారి తల్లిదండ్రులను సన్మానించాలని విద్యాశాఖ వినూత్న కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు ఒక బ్రాండ్ అంబాసిడర్ అని అన్నారు. నేను కూడా ఒక ప్రభుత్వ పాఠశాలలో చదివి ఇప్పుడు ఒక ఉన్నత స్థాయిలో ఉన్నానని ఇది ఒక నిదర్శనంగా తీసుకొని ప్రతి ఒక విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అదనపు కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన, మౌలిక సదుపాయాలు, సన్న బియ్యం , మెనూ ప్రకారం రుచికరమైన ఆహారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల జీవితానికి ఒక వెన్నుముకల ఉంటూ వారి చదువుకు అవసరమైన అన్ని సూచనలు చేస్తారన్నారు. మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత కనబరిచిన విద్యార్థుల ఫోటోలను కరపత్రాల పై ప్రచురించి ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విషయం ప్రతి ఒక్క తల్లిదండ్రులు, విద్యార్థులు నిదర్శనంగా తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జూన్ 2 నుండి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం విద్యార్థుల జ్ఞాపకశక్తి మెరుగు పరిచేందుకు ఉదయం అల్పాహారం కూడా మొదలుపెట్టనుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి ఉచితంగా పుస్తకాలు, షూ , స్కూల్ యూనిఫామ్ తదితరవి ప్రభుత్వం ఉచితంగా అందించి విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. విద్యార్థులు పదో తరగతి ఫలితాలు ఒక ఇన్స్పిరేషన్ గా తీసుకొని జీవితంలో ముందుకు వెళ్లాలని కలెక్టర్ కోరారు. అనంతరం పదవ తరగతి, ఇంటర్మీడియట్ , స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 9 మంది విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న రూ.10 వేల క్యాష్ అవార్డులు అందించి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. తదుపరి మండల స్థాయిలో మండలానికి 3 టాపర్లను ఎంపిక చేసిన 51 మంది విద్యార్థిని, విద్యార్థులను శాలువా మెమెంటోళతో ఘనంగా సన్మానించారు. తదుపరి ప్రభుత్వ పాఠశాలలో 90% శాతం పైన ఫేస్ రికగ్నైజేషన్ కనబరిచిన ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, జిల్లా ఉపాధి కల్పన అధికారి సాహితి, టీజీవో అధ్యక్షులు మందడి ఉపేందర్ రెడ్డి, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థి తల్లిదండ్రులు, విద్యాశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# సినిమా వార్తలు | MOVIE NEWS



## స్పెషల్ ఎంట్రీ

టాలీవుడ్‌కి స్పెషల్ ఎంట్రీ ఇచ్చారు బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీ. హవీష్ హీరోగా నటించిన 'నేను రెడీ' సినిమాలో నర్గీస్ ఫక్రీ స్పెషల్ సాంగ్ చేశారు. తెలుగులో ఆమె నటించిన తొలి చిత్రం ఇదే. కావ్య థాపర్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో బ్రహ్మానందం, శ్రీలక్ష్మి, 'వెన్నెల' కిశోర్, మురళీ శర్మ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో కోనేరు సత్యనారాయణ, నిఖిల కోనేరు నిర్మించారు. ''నేను రెడీ' సినిమా రీ-రికార్డింగ్ పనులతో సహా ఇటీవలే షూటింగ్ పూర్తయింది. జూన్ రెండో వారంలో ఈ సినిమాను విడుదల చేయడానికి సిద్ధం చేస్తున్నాం. హవీష్‌కు క్లీన్ కమర్షియల్ విజయాన్ని అందిస్తుందన్న నమ్మకం ఉంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్.



## 9 నెలల్లో 10 కిలోల బరువు తగ్గా..

బొద్దుగా కనిపించే హీరోయిన్లు, హఠాత్తుగా బక్కచిక్కిపోయి కనిపిస్తే ఎవరికైనా లేనిపోని సందేహాలు వస్తాయి. హీరోయిన్ కీర్తి సురేశ్ గురించి గతంలో ఇలానే అనుకున్నారు. 2018లో 'మహానటి'లో నిండుగా బొద్దుగా కనిపించిన ఈమె.. తర్వాత కాలంలో ముఖంలో జీవకళ కోల్పోయినట్లు సన్నగా మారిపోయి షాకిచ్చింది. దీంతో అసలు ఈమెకు ఏమైందా అనుకున్నారు. కొందరైతే సర్జరీ చేసుకుందేమోనని కామెంట్స్ చేశారు. ఇప్పుడు ఆ సందేహాలపై స్వయంగా కీర్తినే క్లారిటీ ఇచ్చేసింది. సోషల్ మీడియాలో పెద్ద పోస్ట్ పెట్టింది. '2013లో నటిగా కెరీర్ ప్రారంభించినప్పుడు ఫిట్‌నెస్‌పై నాకేం అవగాహన లేదు. జిమ్ నా వల్ల కాదు అనుకునేదాన్ని. 2018లో 'మహానటి' చేసిన తర్వాత కాస్త గ్యాప్ దొరకడంతో ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలనుకున్నా. హెచ్ఐఐటీ, కార్డియో వర్కౌట్స్‌తో పాటు ఎక్కువ ప్రొటీన్, తక్కువ కార్బో డైట్ పాటించి 9 నెలల్లో 10 కిలోల బరువు తగ్గాను. కానీ నేను ఇంత కష్టపడితే కొందరు మాత్రం బలహీనంగా కనిపిస్తున్నావు, సర్జరీలు చేయించుకున్నావా అని అన్నారు. అది నాకు ఆవేదన కలిగించింది''2020లో యోగా చేయడం మొదలుపెట్టిన తర్వాత నా జీవితంలో పెద్ద మార్పు వచ్చింది. మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, శరీరంపై ప్రేమ పెరిగింది. సరైన విధంగా జిమ్ చేస్తే ఎంత ఉపయోగమో, స్ట్రెంగ్త్ ట్రైనింగ్ ఎంత ముఖ్యమో అర్థమైంది. ప్రస్తుతం స్ట్రెంగ్త్ ట్రైనింగ్‌తోపాటు యోగా, అనిమల్ ఫ్లో, కార్డియో, కాలిస్థెనిక్స్‌ను బ్యాలెన్స్‌గా చేస్తున్నాను. ఇప్పుడే నా జీవితంలో బెస్ట్ ఫేజ్‌లో ఉన్నా''అయితే నా చిన్నప్పుడు కాస్త లావుగా ఉన్నానని సన్నబడమని చెప్పినవాళ్లే.. ఇప్పుడు సన్నబడిన తర్వాత గతంలోనే బాగున్నావని అంటున్నారు. అసలు ప్రపంచం ఎలా ఆలోచిస్తుందో అర్థం కావట్లేదు. ఈ మధ్య శారీరకంగా, మానసికంగా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నవడం వల్లే బయట కనిపించలేదు. జీవితంలో ఎప్పుడైనా బ్రేక్ తీసుకోవాల్సి రావచ్చు. కానీ జిమ్‌ని మాత్రం ఎప్పటికీ వదిలిపెట్టను' అని కీర్తి సురేశ్ చెప్పుకొచ్చింది. కేరళకు చెందిన కీర్తి సురేశ్.. 'నేను శైలజ'తో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. 'మహానటి'తో అదరగొట్టి ఉత్తమ నటిగా జాతీయ అవార్డ్ కూడా దక్కించుకుంది. రీసెంట్ టైంలో టాలీవుడ్‌లో పెద్దగా నటించలేదు. ప్రస్తుతం విజయ్ దేవరకొండ 'రౌడీ జనార్ధన'లో చేస్తోంది.



## రాశి ఖన్నా స్పీడ్‌కు బ్రేకులు..

ఊహలు గుస గుసలాడే సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయమైన బ్యూటీ రాశి ఖన్నా. ఈ ముద్దుగుమ్మ అందానికి కుర్రాళ్లు ఫిదా అయ్యారు. అమ్మడు మొదటి సినిమాతోనే సూపర్ హిట్ అందుకోవడమే కాకుండా, యూత్‌లో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది.ఈ మూవీలో ఈ అమ్మడు నటనకు, అందానికి ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. దీంతో ఈ సినిమా తర్వాత ఈ చిన్నదానికి వరసగా అవకాశాలు తలుపు తట్టాయి. ఈ ముద్దుగుమ్మ ఊహల గుసగుసలాడే సినిమా తర్వాత జోరు, జిల్, బెంగాల్ టైగర్, శివం, సుప్రీం, హైపర్, జై లవకుశ సినిమాలతో మెప్పించింది. అలాగే టచ్ చేసి చూడు, తొలి ప్రేమ,ప్రతి రోజూ పండుగే, వెంకీ మామ,వరల్డ్ ఫేమస్ లవ్, తిరు, పక్కా కమర్షియల్ సినిమాల్లో నటించి మెప్పించింది.ఇక ఈ మధ్య ఈ అమ్మడుకు తెలుగులో కొంత వరకు అవకాశాలు తగ్గాయి. అందువలన కాస్త బ్రేక్ ఇచ్చిన ఈ చిన్నది,సిద్దు జొన్నలగడ్డ సరసన తెలుసు కదా మూవీతో ఎంట్రీ ఇచ్చి తన నటనతో మరోసారి అభిమానుల హృదయాలను గెలుచుకుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com